
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు


నేడే బిగ్ ఫైట్



(కడప-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు జరిగిన ఏడాదిన్నర తరువాత మళ్లీ కడప గడ్డపై టీడీపీ, వైసీపీ మధ్య బిగ్ ఫైట్ మంగళవారం జరగనుంది. ఇవి మండలాలకు చెందిన జడ్పీటీసీ ఉప ఎన్నికలే అయినప్పటికీ.. అసెంబ్లీ పోరుకు ఏ మాత్రం తీసిపోకుండా జరుగుతున్నాయంటే టీడీపీ, వైసీపీలు ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయో తెలుస్తుంది. వారం రోజులుగా జిల్లానే కాదు స్టేట్, అటు సోషల్ మీడియా అంతా ఈ ఉప ఎన్నికలపైనే దృష్టి సారించింది.

పులివెందుల, ఒంటిమిట్టలో మంగళవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5 వరకు పోలింగ్ జరగనుంది. మొత్తం రెండు చోట్ల 45 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పులివెందు లలో 15 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇక్కడ 10 అత్యంత సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఒంటిమిట్టలో 30 కేంద్రాలకు గాను 15 కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తిం చారు.

1450 మందితో బందోబస్తు

పులివెందులలో 10,600 ఓట్లు ఉండగా ఇక్కడ మొత్తం 11 మంది బరిలో ఉన్నారు. టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సతీమణి లతారెడ్డి, వైసీపీ నుంచి హేమంత్‌రెడ్డి బరిలో ఉన్నారు. 98 మంది ఎన్నికల సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. 700 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒంటిమిట్టలో టీడీపీ నుంచి అద్దలూరు ముద్దుకృష్ణారెడ్డి, వైసీపీ నుంచి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి బరిలో ఉన్నారు. ఇక్కడా మొత్తం 11 మంది పోటీ చేస్తున్నారు.. 24,606 ఓట్లు ఉన్నాయి. ఇక్కడ 150మంది ఎన్నికల సిబ్బందిని నియమించడంతో పాటు 750 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఓటుకు నోటు, చీర

పులివెందులలో ఎన్నికను టీడీపీ, వైసీపీకి ప్రతిష్టాత్మకంగా మారడంతో ఇక్కడ గెలుపు కోసం ఇరువురు హోరా హోరీగా పోరాడుతున్నారు. ఇక్కడ ఓటుకు రూ.5వేలు ఇచ్చారు. ఇక మహిళా ఓటర్ల కోసం సోమవారం సాయంత్రం చీరలు పంచిపెట్టారు. ఒంటిమిట్టలో ఓటుకు రూ.3వేలు పంచారు.

పులివెందులలో.. క్షణం క్షణం

పులివెందులలో ఎన్నికలు తీవ్ర ఉత్కంఠ రేపుతున్నాయి. నామినేషన్ తరువాత టీడీపీ, వైసీపీల మధ్య దాడులు జరిగాయి. రెండు వర్గాలపైనా కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం పులివెందులలో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. పోలింగ్ రోజున ఏం జరుగుతుందోనని అందరిలో టెన్షన్ నెలకొంది.

- పులివెందుల, ఒంటిమిట్టలో.. సర్వంసిద్ధం
- 1450 మందితో పోలీసు బందోబస్తు
- వైసీపీ, టీడీపీ మధ్యే పోరు
- పులివెందులలో ఓటుకు నోటుతో పాటు చీరలు

జగన్ మేనమామ బెదిరింపులు

- ఈసీకి లతారెడ్డి ఫిర్యాదు

పులివెందుల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పులివెందుల ఎమ్మెల్యే అయిన జగన్ మేనమామ, కడప జిల్లా వైసీపీ అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి ఎన్నికల అధికారులకు, పోలీసులకు ఫోను చేసి మరలా వచ్చేది మేమే, మీరు సహకరించాలంటూ బెదిరించారంటూ టీడీపీ అభ్యర్థి లతారెడ్డి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఉప ఎన్నికలు నిర్వహించడానికి నియమితులైన సిబ్బంది విధుల కోసం పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారని, అయితే వారికి రవీంద్రనాథరెడ్డి ఫోన్ చేసి తమకు అనుకూలంగా వ్యవహరించకపోతే మీ అంతు చూస్తామని బెదిరించారని ఆమె పేర్కొన్నారు. ఈమేరకు సిబ్బంది తమ దృష్టికి తెచ్చారని ఎన్నికల సిబ్బందిపై బెదిరింపులకు పాల్పడిన రవీంద్రనాథరెడ్డిపై చర్యలు తీసుకోవాలని లతారెడ్డి రాష్ట్ర ఎన్నికల అధికారికి, వైఎస్సార్ కడప జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రవీంద్రనాథ్ రెడ్డిపై కేసు నమోదు చేశామని పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతాయి

- ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి



పులివెందుల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఎన్నికలు ప్రశాంతంగా సాగుతాయని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైసీపీ నాయకులు అర్థంపర్థంలేని ఆరోపణలు చేస్తున్నారన్నారు. వారికి ఓటమి భయం పట్టుకుందన్నారు. అవినాశ్‌రెడ్డి ఎన్నికల్లో గెలవలేక ఏవేవో సాకులు చెబుతున్నారన్నారు. నిన్న డీఐజీ కోయప్రవీణ్ మాట్లాడుతూ కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ఎన్నికలు నిర్వహిస్తున్నామని ప్రకటించారన్నారు. కేవలం 15 పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఈ ఎన్నికలకు 700 మందిని భద్రతకోసం కేటాయించారంటే ఎన్నికలు ఎంత సజావుగా సాగుతాయో వేరే చెప్పాల్సిన అవసరం లేదన్నారు. పాడా నిధులను పులివెందులలో ఇష్టమొచ్చినట్లు దోచేశారన్నారు. పాత రోడ్లకే బిల్లులు చేసుకున్నారన్నారు. ఎలాంటి అభివృద్ధి చేయకుండానే నిధులు మాత్రం ఖర్చుచేశారన్నారు. లిక్కర్ అధిక ధరలకు అమ్మి ఎంత కొల్లగొట్టారో అందరు చూస్తున్నారన్నారు. ప్రభుత్వం ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నా వైసీపీ మాత్రం నిందలు వేయడం మానుకోవడం లేదన్నారు.

పులివెందులలో ఏర్పాట్లు పూర్తి

పులివెందుల రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా మంగళవారం పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మంగళవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఓటింగ్ సాగనుంది. ఈ ఉప ఎన్నిక బరిలో 11మంది అభ్యర్థులు ఉన్నారు. ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ పార్టీలతో పాటు ఎనిమిది మంది స్వతంత్రులు బరిలో నిలిచారు. 15 పోలింగ్ కేంద్రాలకు కేవలం 10,601 మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. ఓటర్ల సంఖ్య చాలా తక్కువ ఉండడంతో పోలింగ్ ఐదారు గంటల్లోనే ముగుస్తుందని అంతా భావిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రత కట్టుదిట్టం చేశారు.



పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్న అధికారులు, సిబ్బంది

ఉప ఎన్నిక కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పులివెందుల రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని పులివెందుల ఎంపీడీవో, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్-2 కృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్పీటీసీ ఉప ఎన్నికలకు సంబంధించిన సమాచారం నిమిత్తం ఈ కంట్రోల్‌రూమ్ 24గంటలు పనిచేస్తుందన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెంబర్ 92810 78337కు ఫోన్ చేసి ఓటర్లు సమాచారం, సమస్యలు తెలుపవచ్చన్నారు.

జావెలిన్ త్రోలో స్టేట్ ఫస్ట్

కమలాపురం రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని దర్గావీధికి చెందిన ఎస్.సూఫియాన్ జావెలిన్ త్రోలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. బాపట్ల జిల్లా చీరాలలో ఈ నెల 9 నుంచి 11 వరకు జరిగిన 36వ ఏపీ స్టేట్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. కడపలోని డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూలులో 9వ తరగతి చదువుతున్న సూఫియాన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ 14 కిడ్స్ జావలిన్ త్రో విభాగంలో ప్రథమస్థానంలో నిలిచి బంగారుపతకం అందుకున్నాడు.



బంగారు పతకం సాధించిన సూఫియాన్

చెత్తపన్ను వసూలు చేసిన వారిపై చర్యలు

- కడప కమిషనర్ మనోజ్‌రెడ్డి



కడప మారుతీనగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కడపలో కొన్ని నెలలుగా చెత్త పన్ను పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడిన 18 మంది కార్పొరేషన్ సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చెత్తపన్ను వసూళ్లను రద్దు చేసిందన్నారు. అయినప్పటికీ కార్పొరేషన్‌లో పనిచే సే 18 మంది అక్రమ వసూళ్లకు పాల్పడ్డారన్నారు. ఈ వ్యవహారంలో తొలుత 8 మందిని గుర్తించామని, ప్రస్తుతం మరో 10 మంది ఈ అవినీతికి పాల్పడినట్లు తేలిందన్నారు. మొత్తంగా 18 మందిపై చట్టపరంగా చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. వారి అవినీతిని వెలికితీసేందుకు ఇటీవల ఆరు బృందాలతో సర్వే చేపట్టామన్నారు. ఆ క్రమంలో తాను కూడా ఫీల్డ్‌కు వెళ్లి వాకబు చేశానన్నారు. కడపలోని దాదాపు 2,414 అపార్ట్‌మెంట్లలో, పెద్ద పెద్ద షాపులు, కమర్షియల్ షాపులు, హోటల్స్, హాస్పిటల్స్‌లో విచారించామన్నారు. 2024 ఆగస్టు నుంచి ఈ ఏడాది జూలై వరకు అక్రమ దందాకు పాల్పడిన వారిని గుర్తించామన్నారు. ఇందులో 258 వాటిల్లో అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు తేలిందన్నారు. రూ.4,20,750 అక్రమంగా వసూళ్లు చేసినట్టు స్లిప్పులు, ఫోన్‌పే ద్వారా గుర్తించామన్నారు. అలాగే రూ.12,19,500లకు రిటర్న్ మూలకంగా స్లిప్పులు లేవన్నారు. మొత్తంగా రూ.16.40లక్షలు అక్రమ వసూళ్లు చేసినట్టు తేలిందన్నారు. ఇందులో దాదాపు రూ.7లక్షలు చేశామని, ఈ వ్యవహారంలో ఇంకా ఇతరుల ప్రమేయం ఉందా అని విచారిస్తున్నామన్నారు.

జగన్‌కు ఓటమి భయం పట్టుకుంది

- సేవ్ డెమోక్రసీ అనే అర్హత జగన్ అండ్ కోకు లేదు
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత



మాట్లాడుతున్న మంత్రి సవిత, చిత్రంలో ఎమ్మెల్యే జయనాగేశ్వర్‌రెడ్డి, టీడీపీ నేతలు

ఎర్రగుంట్ల, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): బై ఎలక్షన్‌తో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత పేర్కొన్నారు. సోమవారం ఎర్రగుంట్ల మండలంలోని జువారీ అతిథి గృహంలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బి.జయనాగేశ్వరెడ్డి, టీడీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీలు బీద రవిచంద్ర, ప్రభాకర్ చౌదరి, అనంతపురం టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎర్రగుంట్ల కూటమి ఇన్‌చార్జి మధుసూధన్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నికల్లో పోలీసులను, అధికారాన్ని అడ్డంపెట్టుకుని వైసీపీ శ్రేణులను ఇబ్బందులు పెడుతున్నారని సేవ్ డెమొక్రసీ అని జగన్, అవినాశ్‌రెడ్డిలు మాట్లాడటం ఆశ్చర్యానికి గురిచేస్తోందన్నారు. బాబాయిని గొడ్డలితో నరికి చంపి రాజకీయానికి వాడుకున్న వ్యక్తి జగన్ అన్నారు. ఈ కేసును టీడీపీ వారిపై రుద్దే ప్రయత్నం చేశాడన్నారు. ఇలాంటి వారికి సేవ్ డెమొక్రసీ అనే హక్కు లేదన్నారు. తాము చేసిన సంక్షేమం, సూపర్ సిక్స్ పథకాల వల్ల ప్రజల్లో నమ్మకం వచ్చిందని టీడీపీని పులివెందుల్లో కచ్చితంగా ఆదరిస్తారన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా పులివెందుల ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. వైసీపీ వారు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. పోలింగ్ ప్రశాంతంగా జరుగుతుందన్నారు. టీడీపీ అభ్యర్థి లతారెడ్డి బారీ మెజార్టీతో గెలవబోతున్నట్లు జోస్యం చెప్పారు.

నిర్భయంగా ఓటు వేయండి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



కడప కలెక్టరేట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్టలో మంగళవారం ఉదయం 7 గంటలకు ప్రారంభం కానున్న జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఓటర్లకు సోమవారం పిలుపునిచ్చారు. ఉప ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని, పోలీసు భద్రతాచర్యలు కట్టుదిట్టంగా ఉన్నాయని అన్నారు. సోమవారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ మెటీరియల్ చేరవేశామన్నారు. ఓటరు స్లిప్పులు 96 శాతం పైబడి పంపిణీ చేశామన్నారు. ఓటరు స్లిప్పులు అందని వారు తమ ఆధార్, పాస్‌బుక్, డ్రైవింగ్ తదితర ప్రభుత్వం గుర్తించిన ఫొటోలతో కూడిన ఆధారాలు సమర్పించి ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి కట్టుదిట్టమైన భద్రత చేపట్టేందుకు పోలీసు, ఆర్మ్‌డ్ ఫోర్స్ పోలీసు బలగాలను ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్‌తో పాటు ఆయా ప్రాంతాలకు సంబంధం లేని మైక్రో అబ్జర్వర్లతో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కు వినియోగించు కునేలా ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ రోజున సాయంత్రం 5 గంటల వరకు క్యూలో ఉన్న వారందరూ ఓటు వేయవచ్చన్నారు.

మాజీ ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రెడ్డి మృతి



రాజంపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మాజీ ఎమ్మెల్యే కసిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి (78) సోమవారం రాత్రి మృతి చెందారు. హైదరాబాద్‌లోని తన స్వగృహంలో అనారోగ్యంతో మృతి చెందినట్లు వారి బంధువులు తెలిపారు. మంగళవారం హైదరాబాదులోనే అంత్యక్రియలు జరుగుతాయని ఆయన బంధువులు తెలిపారు. ఆయన 1989లో ఎమ్మెల్యేగా గెలుపొంది 1994 వరకు కొనసాగారు. ఆయన ఎమ్మెల్యేగా ఒకసారి ఉన్నప్పటికీ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేశారు. జిల్లాలో ఉద్దండులైన మాజీ మంత్రి, అసెంబ్లీ సింహంగా పేరొందిన బండారు రత్నసభాపతితోనూ, మాజీ మహిళా ఎమ్మెల్యే కొండూరు ప్రభావతమ్మతోనూ, మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్యతోనూ పోటీ పడ్డారు. ఆయన నిజాయితీ కలిగిన రాజకీయవేత్తగా గుర్తింపు పొంది రాజంపేటలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

పాలనురగలా..



రెండురోజులుగా కురుస్తున్న వర్షానికి కడప నగర శివారులోని పాలకొండల్లో జలపాతం కనువిందు చేస్తోంది. కొండల పైనుంచి దుముకుతున్న జలపాతాన్ని వీక్షించేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. కొందరు జలపాతం వద్ద ఉండే గుండంలో దిగి జలకాలాట ఆడుతున్నారు.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప



ఇద్దరిని బలిగొన్న ట్యాంకర్

- కారును ఢీకొనడంతో ఘటన
- మరో నలుగురికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదానికి గురైన కారు



ఉదయ్‌కుమార్, హుసేనమ్మ మృతదేహాలు

కడప క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అరుణాచలం గిరిప్రదక్షిణ చేసుకుని సొంత గ్రామానికి వెళుతున్న సమయంలో వారిని ఆయిల్ ట్యాంకర్ రూపంలో వారిని మృత్యువు కబళించింది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మరణించగా మరో నలుగురు తీవ్ర గాయాలపాలై మెరుగైన చికిత్స కోసం వారిని కర్నూలుకు తరలిం చారు. వీరందరూ కుటుంబసభ్యు లే. కడప ట్రాఫిక్ పోలీసుల వివరాల మేరకు.. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలోని బాలాజీ స్ట్రీట్‌కు చెందిన దూదేకుల హుసేనమ్మ(55), కుమారుడు రాజా దస్తగిరి, కోడలు షర్మిల, మనవడు ప్రియాన్ష్‌తో పాటు షర్మిల సోదరుడు అయిన ఆళ్లగడ్డలోని ఎస్.లింగందిన్నె గ్రామానికి చెందిన దూదేకుల ఉదయ్‌కుమార్ (32), అతని తండ్రి లల్లుతో కలిసి శని వారం కారులో తమిళనాడులోని అరుణాచలం వెళ్లారు. గిరిప్రదక్షిణ అనంతరం తిరిగి సొంత గ్రామానికి బయల్దేరారు. కడప నగరం బైపాస్‌రోడ్డులోని శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోకి ఆదివారం రాత్రి 11.30గంటలకు రాగానే కర్నూలు నుంచి తిరుపతి వైపు వస్తున్న ఆయిల్ ట్యాంకరు ఢీకొంది. ఈ ప్రమాదంలో హుసేనమ్మ, అల్లుడు వరుసయ్యే ఉదయకుమార్ అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వాహనదారులు కడప ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో గాయపడ్డవారిని రిమ్స్‌కు తరలించారు. నలుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హుసేనమ్మ, ఉదయ్‌కుమార్ మృతదేహాలు కడప రిమ్స్ మార్చురీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తపాలా శాఖ ఉద్యోగి చేతివాటం

- ప్రజలకు చెందిన రూ.18 లక్షలు స్వాహా?
- కేవీపల్లె మండలంలో ఘటన
- లబోదిబోమంటున్న ఖాతాదారులు

పీలేరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసులో పొదుపు, చింతలు లేని జీవితానికి మలుపు అంటూ తపాలా శాఖ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తుంటుంది. ఆ ప్రచారానికి ఆ శాఖకు చెందిన సిబ్బంది తూట్లు పొడిచిన సంఘటన కేవీ పల్లె మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. కేవీపల్లె మండలం మల్లారపువాండ్లపల్లెకు చెందిన బ్రాంచ్ పోస్టుమాస్టర్ ఖాతాదారుల సంతకాలు ఫోర్జరీ చేయడమే కాకుండా కొంతమందికి అసలు పాసుపుస్తకాలు కూడా ఇవ్వకుండా సొమ్మును కాజేశాడు. ఈ విషయం ఆనోటా ఈనోటా నలిగి చివరకు తపాలా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లగా వారు అతడిని సస్పెండ్ చేశారు. అయితే తాము అతడి వద్ద జమ చేసిన సొమ్ము నిజంగా తపాలా శాఖకు వెళ్లిందో, అతనే కాజేశాడో తెలియక కొంత మంది ఆందోళన చెందుతుండగా తమ పాసుపుస్తకాలు తమకు ఇప్పిస్తే చాలని కొంతమంది మల్లారపువాండ్లపల్లె గ్రామస్థులు అధికారులను వేడుకుంటున్నారు.

రూ.18 లక్షల మేర స్వాహా?

కేవీపల్లె మండలం మల్లారపువాండ్లపల్లెలో బ్రాంచ్ పోస్టాఫీసు ఉన్నది. ఆ గ్రామంతో పాటు చుట్టుపక్కల ఉన్న 14 గ్రామాల ప్రజల ఆర్థిక లావాదేవీలకు ఆ పోస్టాఫీసు కేంద్రంగా ఉండేది.



మల్లారపువాండ్లపల్లెలోని తపాలా కార్యాలయం

ఉత్తరాల బట్వాడాతో పాటు తపాలా శాఖలో సంప్రదాయబద్ధంగా ఉండే ఆర్‌డీ, ఎస్‌బీ, సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై), టైం డిపాజిట్‌లు, రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (ఆర్‌పీఐఎల్), మని ఆర్డర్ సేవలు, ఉపాధి హామీ బిల్లులు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ సేవలు అందుబాటులో ఉండేవి. ఆ బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా రెండేళ్ల క్రితం వచ్చిన చైతన్య ఆ గ్రామంలో జరిగే ఆర్థిక లావాదేవీలను తన అక్రమాలకు ఆలంబన చేసుకున్నాడు. తాను సూచించిన పథకాల్లో డబ్బు డిపాజిట్ చేసుకుంటే స్వల్ప కాలంలో అధిక రాబడులు ఉంటాయని చాలామంది మహిళల వద్ద డిపాజిట్‌లు సేకరించాడు. రూ.50 వేలు డిపాజిట్ చేస్తే ఏడాదిలోనే రూ.లక్ష వస్తుందని, రూ.లక్ష డిపాజిట్ చేస్తే రెట్టింపు అవుతుందని నమ్మబలికాడు.

దీంతో చాలామంది మహిళలు అతడి మాటలు నమ్మి అతనికి డబ్బు అందించారు. పీలేరులోని తపాలా కార్యాలయంలో పాసు పుస్తకాలలో ఎంట్రీ వేయించి ఇస్తానని చెప్పడంతో చాలామంది మహిళలు అతడిని తమ పాసుపుస్తకాలు కూడా అడగలేదు. దీంతో అతను యథేచ్ఛగా వారి నమ్మకాన్ని సొమ్ము చేసుకున్నాడు. అలా ఏకంగా రూ.18 లక్షల మేర ప్రజల సొమ్మును దుర్వినియోగం చేశాడు. ఎంతకీ పాసుపుస్తకాలు ఇవ్వకపోవడంతో కొంతమంది గ్యారంపల్లెలోని తపాలా కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో అతడి బండారం బయటపడింది. నెల క్రితం అధికారులు విచారించి అతడి వద్ద పాసు పుస్తకాలను స్వాధీనం చేసుకుని అతడిని సస్పెండ్ చేశారు.

ఆందోళన చెందాల్సిన పని లేదు

మా శాఖ పాసు పుస్తకాల్లో ఎంట్రీ ఉన్న ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన పని లేదు. వారందరికీ డబ్బు అందుతుంది. అతను పాసు పుస్తకాల్లో ఎంట్రీ వేయకుండా ఉంటే ఏమీ చేయలేము. అతడిపై ఫిర్యాదులు వచ్చిన మరుసటిరోజే అతనిపై ప్రాథమిక విచారణ జరిపి సస్పెండ్ చేశాం. పీలేరు ఇన్‌స్పెక్టర్ శిక్షణలో ఉండడంతో విచారణలో ఆలస్యం జరుగుతోంది. ఆయన వచ్చిన వెంటనే విచారణను వేగవంతం చేసి ఖాతాదారుందరికీ న్యాయం చేస్తాం.

- పవన్, పీలేరు ఇన్‌చార్జ్ తపాలా ఇన్‌స్పెక్టర్

నేను కట్టిన డబ్బు ఏమైందో తెలియడం లేదు



ఆ పిల్లోడిని నమ్మి నా పాసు పుస్తకాలు అతడి చేతిలో పెట్టి పోయిన మూడేండ్లుగా నెలకు రూ.1500 కట్టాను. ఇప్పుడు ఆ డబ్బు ఉందో, పోయిందో అర్థం కావడం లేదు. ఆ పిల్లోడు ఉన్నప్పుడు అడిగితే ఐదేళ్ల తరువాత తీసుకోవచ్చులే అనేవాడు. నా పాసు పుస్తకాలు చెక్ చేసి నాకు న్యాయం చేయండి.

- అలివేలమ్మ, మల్లారపువాండ్లపల్లె

రూ.1.40 లక్షలు కట్టాను



ఆర్‌డీ, టీడీ, లైఫ్ ఇన్సూరెన్స్ కలిపి నేను మొత్తం రూ.1.40 లక్షలు కట్టాను. నా పాసుపుస్తకాలు కూడా పోస్టాఫీసులోనే ఉన్నాయి. వాటిని చూసుకుందామంటే ఆఫీసర్లు కుదరదు అంటున్నారు. మా డబ్బులు మాకు తిరిగి ఇప్పించాలని పీలేరు పోస్టాఫీసులో కంప్లైంట్ కూడా ఇచ్చాను.

- రాధమ్మ, కిచ్చిలివారిపల్లె

లబోదిబోమంటున్న గ్రామస్థులు

బ్రాంచ్ పోస్టుమాస్టర్ అయిన చైతన్యను నమ్మి అతడి చేతిలో సొమ్ములు పెట్టిన గ్రామస్తులు ప్రస్తుతం లబోదిబోమంటున్నారు. తాము అతడికి ఇచ్చిన సొమ్ములు తమ పాసుపుస్తకాల్లో నమోదయ్యాయో లేదో కూడా తెలియడం లేదని, గ్యారంపల్లె, పీలేరులోని పోస్టాఫీసులలో అడిగితే అతడిపై విచారణ జరుగుతోందని, అప్పటి వరకు ఏమీ తేల్చి చెప్పలేమన్న సమాధానం వస్తోందని వారు వాపోతున్నారు. ఈలోపు అతని తరఫున కొంత మంది గ్రామానికి వచ్చి అతను తీసుకున్న డబ్బులను రెండు, మూడు నెలల్లో తాము చెల్లిస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుతం వారు కూడా సరైన సమాధానం చెప్పడం లేదని బాధపడుతున్నారు.

నులిపురుగులను నివారిద్దాం

- 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు
- నేడు జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం



మాట్లాడుతున్న అడిషనల్ డైరెక్టర్ అనిల్‌కుమార్

సంబేపల్లె, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): శరీరంలోని పేగుల్లో చేరిన నులిపురుగులను ఒక ఆల్బెండజోల్ మాత్రతో చెక్ పెట్టవచ్చని డాక్టర్లు చెబుతున్నారు. నులిపురుగులు ఉంటే రక్తహీనత, నీరసం, కడుపులో నొప్పి వంటి ఇబ్బందులు ఎదురవుతాయి. నులిపురుగులను నివారించి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. చిన్నారుల్లో శారీరక, మానసిక ఎదుగుదలను నిరోధించి వారి పోషకాలను గ్రహించి వారిని శక్తిహీనులుగా మారుస్తాయి చిన్నవయస్సులోనే ఈ నులిపురుగులను నివారిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారవు తారు. జాతీయ ఆరోగ్య సంస్థ నులిపురుగుల నివారణకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతుంది.

వ్యాధి వ్యాప్తి ఇలా...

పిల్లలు మట్టిలో ఆడుకుని చేతులు కడగకుండా భోజనం చేయడం ద్వారా నులిపురుగులు వ్యాప్తి చెందుతాయి. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జనలో ఈ పురుగులు వ్యాప్తి అవుతాయి. నులిపురుగుల బారినపడిన పిల్లల్లో ప్రధానంగా రక్తహీనత ఏర్పడుతుంది. పోషక లోపం, ఆకలి లేకపోవడం, బలహీనంగా మారతారు. తీవ్రమైన కడుపునొప్పి, విరేచనాలు, మలంలో రక్తం రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

నివారణ మాత్రల పంపిణీ

నులిపురుగుల నియంత్రణకు మాత్రలు పంపిణీ చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. పాఠశాలలు అంగన్వాడీ కేంద్రాల వద్ద పిల్లలకు పంపిణీ చేస్తారు. సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కావడంతో 1 నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్న వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు. 1 నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లో, 6 నుంచి 19 ఏళ్ల వారికి పాఠశాలలు, కళాశాలల్లో అందజేస్తారు. రెండేళ్లలోపు చిన్నారులకు సగం మాత్రమే నీటిలో కలిపి తాగించాలి. 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్ర 400 ఎంజీ వేయించాలి. అన్నమయ్య జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సున్న వారు జిల్లా వ్యాప్తంగా 3,96,267 మంది ఉన్నారు.

ఏర్పాట్లన్నీ పూర్తి

నులిపురుగుల నివారణకు మాత్రలను పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వైద్య ఆరోగ్యశాఖ విజయవాడ అడిషినల్ డైరెక్టర్ అనిల్‌కుమార్, డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య తెలిపారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం ప్రోగ్రాం ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. భోజనం చేసినతర్వాతనే వీటిని వేసుకోవాలి. మాత్రలు వేసుకున్న వారికి ఏవైనా సమస్యలు వస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంవో రియాజ్‌బేగ్, డీఐవో ఉషశ్రీ, డీఎల్ఏటీవో రమేశ్‌బాబు, పీవోఆర్‌బీఎస్‌కే శివప్రతాప్, డీఎస్ఎంవో విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయండి



లోక్‌అదాలత్‌పై మాట్లాడుతున్న ఇన్‌చార్జి న్యాయాధికారి కీర్తన

తంబళ్లపల్లె, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె జూనియర్ సివిల్ కోర్టులో సెప్టెంబరు 13న నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని ఇన్‌చార్జి న్యాయాధికారి కీర్తన అన్నారు. సోమవారం స్థానిక సివిల్ కోర్టులో పోలీసులు, న్యాయవాదులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో వాది, ప్రతివాది సయోధ్య అంగీకారంతో రాజీ మార్గంలో కేసులు పరిష్కారమవుతాయన్నారు. లోక్‌అదాలత్ ఉపయోగాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కారమైతే మళ్లీ అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండదని, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, పోలీసు సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెక్కులు అందజేత



చెక్కులు పంపిణీ చేస్తున్న రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి

సుండుపల్లె, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): పంటలు నష్టపోయిన రైతులకు రూ.1.95 లక్షలు నష్టపరిహారం చెక్కులు అందజేసినట్లు రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా డీఎఫ్‌వో ఆదేశాల మేరకు ఏనుగులు, అడవిపందుల వలన పంటలు నష్టపోయిన 10 మంది రైతులకు చెక్కులను అందజేశామన్నారు. పంటలు నష్టపోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న రైతులకు ప్రభుత్వం ఈ చెక్కులను అందజేసినట్లు తెలిపారు. అడవి మృగాల వలన పంటలు నష్టపోయినట్లయితే వెంటనే ఫారెస్ట్ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారాన్ని నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందజేయడం పట్ల బాధిత రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవో అంజనస్వామి పాల్గొన్నారు.

నేటి నుంచి ధర్మవరం-నరసాపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు



ములకలచెరువు, ఆగస్టు 11 (ఆంధ్ర జ్యోతి): ధర్మవరం నుంచి ములకలచెరువు మీదుగా నరసాపూర్‌కు ప్రతి రోజు నడిచే రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్ళు మంగళవారం నుంచి రద్దు కానున్నాయి. గుంటూరు సమీపంలోని పెదవడ్లపూడి - దుగ్గిరాల, తెనాలి-చందూరు రైల్వే సెక్షన్‌లో మూడవ రైలు మార్గం ప్రీఎన్ఐ, ఎన్ఐ పనుల కారణంగా ఈ రెండు రైళ్ళు పాక్షికంగా రద్దు చేస్తు రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నరసాపూర్ నుంచి ధర్మవరం(17247)కు నడిచే రైలు మంగళవారం నుంచి ఈ నెల 19వతేదీ వరకు రద్దు చేశారు.

అలాగే ధర్మవరం నుంచి నరసాపూర్(17248) ఎక్స్‌ప్రెస్ రైలు కూడా మంగళవారం నుంచి ఈ నెల 19వతేదీ వరకు రద్దయ్యింది. ఈ నెల 20వతేదీ నుంచి రైళ్ళు తిరిగి నడవనున్నాయి. రైళ్ళ రద్దుతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పవు. ముఖ్యంగా ములకలచెరువు, మదనపల్లె, కలికిరి, పీలేరు తిరుపతి తదితర ప్రాంతాల ప్రయాణికులకు ఎంతో అనుకూలంగా ఉన్న రెండు రైళ్ళు వారం రోజులపాటు రద్దయ్యాయి.

కౌలు రైతులను ఆదుకోలేని దుర్మార్గుడు జగన్

- జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమిదే విజయం
- సంక్షేమంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదు
- బెంగళూరులో వర్క్ ఎట్ హోంలో ఉన్న జగన్‌కు ఏమి తెలుసు?
- అన్నమయ్య డ్యాం కొట్టుకుపోతే బాధితులకు న్యాయమేదీ!
- మంత్రి నాదెండ్ల మనోహర్ ఆగ్రహం



సభలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

రైల్వేకోడూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సొంత నియోజకవర్గం అయిన పులివెందులలో గత వైసీపీ ప్రభుత్వంలో కౌలు రైతులు 21 మంది ఆత్మహత్య చేసుకుంటే వారి కుటుంబాలను ఆదుకోలేని దుర్మార్గుడు మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. సోమవారం రైల్వేకోడూరు మార్కెట్ కమిటీ చైర్మన్ పగడాల వరలక్ష్మి ప్రమాణ స్వీకారానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా ఆత్మహత్యలకు పాల్పడిన కౌలు రైతుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున పంపిణీ చేశారన్నారు. పులివెందులలో మృతి చెందిన రైతు కుటుంబాలను ఆదుకోవాలని పవన్‌కళ్యాణ్ ఉమ్మడి కడప జిల్లాలోని సిద్దవటంలో రైతు సమావేశం ఏర్పాటు చేశారని సమావేశానికి పులివెందుల నుంచి 21 మంది కౌలు రైతులను గుర్తించి రావాలని సమాచారం అందిస్తే 17 మంది మాత్రమే వచ్చారని తెలిపారు. మిగిలిన కౌలు రైతు కుటుంబాలను వైసీపీ నాయకులు భయభ్రాంతులకు గురిచేయడంతో రాలేదన్నారు. రాష్ట్రంలో కౌలు రైతులు 113 మంది ఆత్మహత్య చేసుకుని చనిపోయారన్నారు. వారికి భరోసా ఇవ్వడానికి ఒక్కొక్కరికి రూ.లక్ష ఇచ్చి ఆదుకున్న ఘనత పవన్‌కళ్యాణ్‌కే దక్కిందన్నారు.

అన్నమయ్య డ్యాం కొట్టుకుపోతే వైఎస్ జగన్ పట్టించుకోకుండా గాలికి వదిలేశారన్నారు. బాధితులకు ఇళ్లు కట్టిస్తామని చెప్పి మాట తప్పి 2024లో జరిగిన ఎన్నికల్లో కొట్టుకునిపోయారని తెలిపారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో కేసులు, పోలీసుల ఆంక్షలు పెట్టి ప్రజలను, ప్రతిపక్ష నాయకులను ఇబ్బంది పెట్టారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో అరాచకాలు జరిగాయని తెలిపారు. మైసూరివారిపల్లెలో అకారణంగా, అన్యాయంగా జనసేన నాయకులపై కేసులు పెట్టారని గుర్తు చేశారు. ఇదే పంచాయతీలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కారుమంచి సంయుక్త జనసేన అభ్యర్థిగా విజయం సాధించిందన్నారు. అందుకనే రైల్వేకోడూరు అంటే పవన్‌కళ్యాణ్‌కు ప్రేమ ఉందన్నారు.

ఉమ్మడి కడప జిల్లాలోని ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం ఖాయమన్నారు. సంక్షేమం, అభివృద్ధి చూసి ప్రజలు కూటమికే ఓటు వేస్తారని తెలిపారు. వైసీపీ నాయకులు ఎన్నికల్లో నిలవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రాన్ని దివాలా తీసి ఏ ముఖం పెట్టుకుని ఎన్నికల్లో ప్రచారం చేశారని ప్రశ్నించారు. బెంగళూరులో వర్క్ ఎట్ హోంలో ఉన్న వైఎస్ జగన్‌కు ప్రజల గురించి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ఎలా నడపాలో తెలియదన్నారు. రైల్వేకోడూరులో శీతల గిడ్డంగిని ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిల దృష్టి తీసుకెళ్లి మంజూరు చేయిస్తామని తెలిపారు. ఉద్యాన పంటలైన మామిడి, అరటి, బొప్పాయి తదితర వాటికి మద్దతు ధర ఇచ్చింది కూటమి ప్రభుత్వమేనని గుర్తు చేశారు. రైతులకు డ్రిప్ ఇరిగేషన్ అందిస్తున్నామన్నారు.

అనుభవం కలిగిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో పవన్‌కళ్యాణ్ ఆలోచనలతో రాష్ట్రం సుభిక్షంగా ఇంకా 15 ఏళ్లపాటు ఉండాలన్నారు. రాష్ట్రంలో 4.40 కోట్ల మందికి స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. రైల్వేకోడూరు వారికి అండగా, తోడుగా ఉంటామని చిన్న చిన్న విషయాలను పెద్దవిగా చేసుకోకుండా అందరూ కలసికట్టుగా ఉండాలన్నారు.

రాయచోటి మార్కెట్ కమిటీ
పాలకవర్గం నియామకం

కలికిరి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాయచోటి వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక సంవత్సరం కాల వ్యవధితో ఈ పాలకవర్గం ఏర్పాటైంది. కమిటీ గౌరవాధ్యక్షుడిగా స్థానిక ఎమ్మెల్యే హోదాలో మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అధ్యక్షుడిగా బోడిరెడ్డి రాంప్రసాద్‌రెడ్డి, డైరెక్టర్లుగా కీర్తి, కోటకొండ శంకర, కాటిమాయకుంట చంద్రయ్య, జల్లా రామతులసి, కొండా లక్ష్మి, వేల్పుల సుజాత, సానంపల్లె జ్యోత్స్న, తంగల వెంకట్రమణ, చామంతుల వెంకటనాగులు, కోటకొండ రఘునాథ, ఉదయగిరి మస్తాన్‌వలి, కూన బాల మురళీకృష్ణ, ముడే తవరా నాయక్‌లను నియమించారు. గొర్లముదివీడు సింగిల్ విండో చైర్మన్, రాయచోటి వ్యవసాయ ఏడీ, రాయచోటి మున్సిపాలిటీ చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారులను కూడా కమిటీలో నియమించారు.

కుటుంబ కలహాలతో డ్రైవర్ ఆత్మహత్య



అనిల్ (ఫైల్)

మదనపల్లె అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. తాలుకా సీఐ కళా వెంకటరమణ కథనం మేరకు... గాలివీడు మండలానికి చెందిన అనిల్ (35), బి.కొత్తకోట మండలం బడికాయలపల్లెకు చెందిన స్వరూపను 12 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి కుమారుడు జేమ్స్ (6), కుమార్తె లిపిక (4) ఉన్నారు. వీరు రెండేళ్ల క్రితం మదనపల్లె మండలం నిమ్మనపల్లె రోడ్డులోని బసినికొండకు వచ్చి నివాసం ఉంటున్నారు. అనిల్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుటుంబ ఖర్చులు పెరగడంతో స్వరూప తిరుపతిలోని ఓ ప్రైవేటు రెస్టారెంట్‌లో పనిచేస్తోంది. పిల్లలు అమ్మమ్మ ఇంట్లో ఉంటున్నారు. కాగా అనిల్ ఆటో కొనుగోలు చేయడానికి రూ.30 వేలు కావాలని భార్య స్వరూపకు ఫోన్ చేశాడు. ఇప్పట్లో కుదరదని చెప్పడంతో వాగ్వాదం చేసుకున్నారు. దీంతో మనస్థాపానికి గురైన అనిల్ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండు రోజుల తరువాత దుర్వాసన వస్తుండడంతో చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. తాలుకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి భార్యకు, కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా సీఐ వెంకటరమణ తెలిపారు.

రాజకీయ పార్టీల అభిప్రాయాలు, సూచనలు కీలకం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

సంబేపల్లె, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేయడానికి రాజకీయ పార్టీల అభిప్రాయాలు, సూచనలు కీలకమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఓటర్ల సవరణ, పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు, వివిధ రకాల ఫారాలు తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో గత సమావేశంలో చర్చించిన వివిధ విషయాలు, సంబంధిత చర్యలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు క్లుప్తంగా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బీఎల్‌వోలను నియమించి సంబంధిత నియామక పత్రాలను ఈఆర్‌వోలకు సమర్పించాలని తెలిపారు. కొత్తగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మార్పులు కావాలనుకుంటే దానికి ఎన్నికల సంఘం అవకాశం ఇస్తారన్నారు. సమావేశంలో రాజంపేట, మదనపల్లె సబ్‌కలెక్టర్లు, హెచ్ఎస్ భావన, చల్లా కళ్యాణి, డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్, కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ వైర్లు.. తప్పిన ప్రమాదం



షాపుపై పడిన 11 కేవీ వైరు

గుర్రంకొండ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ బస్టాండులో ప్రజలు, వ్యాపారస్తుల సౌకర్యార్థం 11 కేవీ, ఎల్‌టీ లైన్ ఏర్పాటు చేశారు. ఈ విద్యుత్ స్తంభాల నుంచి వ్యాపారులు, ప్రజలు కరెంట్ సరఫరాను దుకాణాలకు, ఇళ్లకు తీసుకున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో బస్టాండులోని 11కేవీ విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఈ సమయంలో కొంత మంది మాత్రమే ప్రయాణికులు బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. విద్యుత్ వైర్లు ఒక దానిపై ఒకటి పడడంతో నిప్పు రవ్వలు రేగాయి. దీంతో ప్రయాణికులు పరుగులు తీశారు. పండ్లు, పూల దుకాణాలపై తెగిన విద్యుత్ వైర్లు పడడంతో భయభ్రాంతులకు గురయ్యారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు, ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం ట్రాన్స్‌కో అధికారులు తెగిన విద్యుత్ వైర్లను సరిచేశారు.

బావిలో పడి వ్యక్తి మృతి



చిన్నప్ప మృతదేహం

రామాపురం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీ పరిధిలోని ఎగువ హరిజనవాడకు చెందిన రేణిమణి చిన్నప్ప (52) అనే వ్యక్తి సోమవారం బావిలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీ ఎగువహరిజనవాడకు చెందిన రేణిమాణి చిన్నప్ప బావిలో మోటారు చెడిపోయిందని ఉదయం 9 గంటల సమయంలో బావిలోకి దిగాడు. తదుపరి గంటల పాటు ఆయన పైకి రాకపోవడంతో గ్రామస్థులు ఆయన ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న ఫైర్ డిపార్టుమెంట్ రామాపురం పోలీసులు, రెవెన్యూశాఖ సిబ్బంది వెంటనే ఘటనా స్థలికి చేరుకుని బావిలో గాలింపు చర్యలను ప్రారంభించారు. మృతుడు బావిలో ఉన్న మోటారు కింద పడి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరోగ్యంపై విద్యార్థులు శ్రద్ధ వహించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

గాలివీడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ మాతాశిశు సంరక్షణ డాక్టర్ అనిల్‌కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని నూలివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీవార్మింగ్‌డే నులిపురుగుల నిర్మూలన, రక్తహీనత అధిగమించేందుకు విద్యార్థులకు కొన్ని ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. అందులో భాగంగా మంగళవారం ప్రతి విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రను మింగించి వారి ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ రియాజ్, డాక్టర్ శ్వేత, వైద్య సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు మనోహర్, ఫయాజ్, హరీశ్, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



రాజన్న (ఫైల్)

మదనపల్లె అర్బన్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం ఎరగానిమిట్ట వద్ద గురువారం సాయంత్రం బీఎస్ రెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న అల్లూరి రాజన్న (55) జాతీయ రహదారిపై నడుచుకుంటూ ఆటో కోసం వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజన్నను స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

వైసీపీ వ్యాజ్యం ఉపసంహరణ

● ఎస్‌ఈసీ, పోలీసులు నిబంధనల ప్రకారం నడుచుకుంటారన్న కోర్టు

అమరావతి, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ ఏజెంట్లకు భద్రత కల్పించేలా రాష్ట్రఎన్నికల సంఘం, పోలీసు అధికారులను ఆదేశించాలని కోరుతూ వైసీపీ తరఫున జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తుమ్మల హేమంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వాజ్యం పై సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ విచారణ జరిపారు. ఈ వ్యవహారంలో తాము జోక్యం చేసుకోలేమన్నారు. ఎస్ఈసీ, పోలీసులు చట్టనిబంధనల ప్రకారం నడుచుకుంటారన్నారు. తాము ఏదైనా ఉత్తర్వులు జారీ చేస్తే క్లిష్టమైన పరిస్థితులకు దారి తీస్తాయని పేర్కొన్నారు. ఈ దశలో పిటిషనర్ తరఫు న్యాయవాది వీఆర్‌రెడ్డి కొవ్వూరి జోక్యం చేసుకుంటూ పిటిషన్‌ను ఉపసంహరించుకొనేందుకు అనుమతించాలని కోరారు. అందుకు న్యాయమూర్తి అంగీకరించారు.

మారెడ్డి భరత్‌రెడ్డిని అనర్హుడిగా ప్రకటించాలంటూ వేసిన వ్యాజ్యంలో జోక్యానికి హైకోర్టు నిరాకరణ

పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికలలో టీడీపీ అభ్యర్థికి మారెడ్డి లతారెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తూ స్వతంత్ర అభ్యర్థి మారెడ్డి భరత్‌రెడ్డిని ఎస్ఈసీ, పోలీసులు కల్పించిన సౌకర్యాలను దుర్వినియోగం చేస్తున్నారని, ఆయనను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ వైసీపీ అభ్యర్థి తుమ్మల హేమంత్‌రెడ్డి వేసిన పిటిషన్‌లో జోక్యం చేసుకొనేందుకు హైకోర్టు నిరాకరించింది. అంతకముందు పిటిషనర్ తరఫు న్యాయవాది వీఆర్‌రెడ్డి కొవ్వూరి వాదనలు వినిపిస్తూ... స్వతంత్ర అభ్యర్థి మారెడ్డి భరత్‌రెడ్డి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారన్నారు. ఆయనను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి వినతి ఇచ్చామన్నారు. మారెడ్డి భరత్‌రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ.... ఓ పార్టీకి అభ్యర్థిగా మద్దతుగా స్వతంత్ర అభ్యర్థి ప్రచారం చేయకూడదని చట్టంలో ఎక్కడా లేదన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే ఎన్నికల పిటిషన్ దాఖలు చేసుకోవాలన్నారు.

సింగిల్ జడ్జి ఉత్తర్వులు సరైనవే : ధర్మాసనం

పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా నిర్వహించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు సరైనవేనని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. పిటిషనర్ సమర్పించిన వినతి పై ఇప్పటికే ఎస్ఈసీ ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేసింది. అప్పీల్‌ను పరిష్కరించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది.

పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా పక్రియను రికార్డు చేసేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్‌కు తరలించి, స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచే సమయంలో పోలింగ్ ఏజెంట్లను అనుమతించాలని, తటస్థ ఎన్నికల అబ్జర్వర్లను నియమించాలని, ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయకుండా పోలీసులను నిలువరించాలని కోరుతూ వైసీపీనేతలు సింగిల్ జడ్జి వద్ద వ్యాజ్యాలు వేశారు. వ్యాజ్యాల పై విచారణ జరిపిన సింగిల్ జడ్జి ఎన్నికలు స్వేచ్ఛగా సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్ఈసీతో పాటు జిల్లా కలెక్టర్, పోలీసులను ఆదేశించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ వైసీపీనేతలు ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. అప్పీల్ సోమవారం విచారణకు రాగా సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ... తటస్థ అబ్జర్వర్లను నియమించాలని, సీసీకెమెరాలు ఏర్పాటు చేసి ఎన్నిక ప్రక్రియను రికార్డు చేయాలన్న పిటిషనర్ వినతిని సింగిల్ జడ్జి తిరస్కరించారన్నారు. ధర్మాసనం స్పందిస్తూ ఎన్నికను స్వేచ్ఛగా, సజావుగా నిర్వహించాలని సింగిల్ జడ్జి సరైన ఉత్తర్వులే ఇచ్చారని స్పష్టం చేసింది.

ముగిసిన బ్యాడ్మింటన్ ఎంపికలు



ఎంపికైన క్రీడాకారులతో డీఎస్‌డీవో జగన్నాథరెడ్డి

కడప స్పోర్ట్స్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నగర డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహించారు. జాతీయ క్రీడాదినోత్సవ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన క్రీడా పోటీల్లో భాగంగా సోమవారం బ్యాడ్మింటన్ ఎంపికలు జరిగాయి. ఇందులో సుమారు 40మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. సింగిల్స్, డబుల్స్ విభాగంలో విడివిడిగా పోటీలు నిర్వహించి జిల్లా జట్టు ఎంపిక చేశారు. ఈసందర్భంగా డీఎస్‌డీవో జగన్నాధరెడ్డి మాట్లాడుతూ బ్యాడ్మింటన్ క్రీడలో కడప జిల్లాకు మంచి గుర్తింపు ఉందన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 16, 17 తేదీల్లో తిరుపతిలో జరగనున్న జోనల్‌స్థాయి పోటీల్లో.. అనంతరం విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి జిల్లాకు పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ కోచ్ సుదర్శన్, జాకీర్‌బాషా పాల్గొన్నారు.

జోనల్ పోటీలకు ఎంపికైన బాలికల జట్టు : పూజిత, రెడ్డిపద్మిని, సాయి నిఖిత, బి.కళ్యాణి **బాలుర జట్టు :** విశ్వతేజ, యోగేశ్, జశ్వంత్, పవన్‌రెడ్డి


పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల



మైలవరం నుంచి పెన్నానదికి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

మైలవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటి విడుదల కొనసాగుతోందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలాశయ, పోలీసు అధికారులు తెలిపారు. మైలవరం జలాశయం నుంచి మూడు గేట్ల ద్వారా 5వేల క్యూసెక్కులు నీరు విడుదల చేస్తుండగా.. ఉత్తర, దక్షిణ కాలువలకు 100 క్యూసెక్కులు చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. దీనికితోడు వర్షం ధాటికి ఎక్కువగా నీటి ప్రవాహం ఉందని, పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మైలవరం జలాశయం నీటి నిలువ సామర్థ్యం 6.5టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రస్తుతం 5.4 టీఎంసీల నీరు నిలువ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఉధృతంగా పెన్నా ప్రవాహం



పెన్నానదిలో లోలెవల్ కాజ్‌వేపై వరద నీటి ప్రవాహం

సిద్దవటం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం వద్ద పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గంట గంటకు నీటి ప్రవాహం పెరగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. లోతట్టు గ్రామాలైన వంతాటిపల్లె, గాండ్లపాలెం, ఆకుల వీధి, జ్యోతి గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు. ఎస్ఐ మహమ్మద్‌రఫీ మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు పెన్నానదిలో నీటిమట్టం పెరగడంతో లోలెవల్ కాజ్‌వేపై వరదనీరు ప్రవహిస్తోందని, చేపల వేటకు వెళ్లే జాలర్లు వేటకు వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేశామని, కొన్ని పల్లె ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేశామని తెలిపారు.

పాలిటెక్నిక్ అడ్మిషన్లపై రూల్స్ విడుదల

అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలపై సాంకేతిక విద్యాశాఖ కొత్త రూల్స్ విడుదల చేసింది. 'ఏపీ పాలిటెక్నిక్ అడ్మిషన్ల నియంత్రణ, రాష్ట్ర స్థాయి సాంకేతిక విద్యాసంస్థల నిబంధనలు-2025' పేరుతో ఈ రూల్స్ రూపొందించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకూ 1988లో ఇచ్చిన 146 జీవో ఆధారంగానే ప్రతి సంవత్సరం పాలిటెక్నిక్‌లలో అడ్మిషన్లు చేపడుతున్నారు. గత కొన్నేళ్లుగా వచ్చిన మార్పులకు అనుగుణంగా ప్రతి ఏడాదీ సవరణలు ఇస్తున్నారు. ఇకపై ప్రతిసారీ సవరణల అవసరం లేకుండా కొత్త రూల్స్ జారీచేశారు. పాలిసెట్ నిర్వహణ, పాలిటెక్నిక్‌లలో అడ్మిషన్లకు ప్రస్తుతం ఉన్న నిబంధనలే యథావిధిగా అమలవుతాయి. పాలిసెట్, అడ్మిషన్లకు ఆన్‌లైన్ విధానం కొనసాగుతుంది. ఇందుకోసం వేర్వేరుగా కమిటీలు నియమించారు. 2026-27 విద్యా సంవత్సరం నుంచి ఈ రూల్స్ అమల్లోకి వస్తాయి.

కాంట్రాక్టు జేఎల్స్‌ను క్రమబద్ధీకరించాలి

అమరావతి, తాడేపల్లి టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ తిరిగి ప్రారంభించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లు తాడేపల్లిలోని ఇంటర్మీడియట్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఎన్నికలకు ముందు కాంట్రాక్టు జేఎల్స్‌ను రెగ్యులరైజ్ చేసే ప్రక్రియ ప్రారంభించారని, ఎన్నికల సమయంలో దానికి బ్రేక్ పడిందని, ఇప్పుడు తిరిగి కొనసాగించాలని నినాదాలు చేశారు. ఇంటర్ విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ తాతారావుకు వినతిపత్రం అందజేశారు.

నా కారు ఇప్పించి ఆదుకోవాలి

● జిల్లా అధికారులకు ఓ బాధితుడి ఆవేదన

కడప మారుతీనగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ పోషణ కోసం కారు కొనుగోలు చేసి జీవిస్తున్నానని, తన కారును బాడుగ పేరుతో తీసుకెళ్లి ఓ వ్యక్తి మోసం చేశాడని గోపవరం మండలం మడకలవారిపల్లెకు చెందిన జి.సిద్దయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ 31 టీపీఏ 1113 అనే నెంబరు గల తన ఇథియోస్ కారును 2024 మార్చిలో కొనుగోలు చేసి బాడుగలకు తిప్పుకుని జీవనం సాగిస్తున్నానన్నారు. ఈ క్రమంలో బద్వేలుకు చెందిన సుంకర విశ్వనాధ్ అనే వ్యక్తి తన కారును నాలుగు రోజులు బాడుగకు అని చెప్పి తీసుకెళ్లి... తిరిగి తనకు ఇవ్వలేదన్నారు. ఈ విషయంపై తనను అడగ్గా... కడపలోని ఓ ప్రభుత్వ కార్యాలయానికి బాడుగకు పెట్టానని, నెలకు రూ.21,500 వస్తుందని.. ఆ డబ్బులు ఇస్తానని చెప్పాడన్నారు. ఒక నెల డబ్బులు మాత్రం ఇచ్చాడని, తరువాత డబ్బులు ఇవ్వకుండా.. కారు అప్పగించకుండా తప్పించుకుని తిరుగుతున్నారన్నారు. ఈ విషయంపై ఎనిమిది నెలల క్రితం ఎస్పీకి ఫిర్యాదు చేయగా.. బద్వేలు స్టేషన్‌కు రెఫర్ చేశారన్నారు. అక్కడ తనకు న్యాయం చేయడం లేదన్నారు. జిల్లా అధికారులు స్పందించి తన కారును తనకు ఇప్పించాలని కోరారు. సమావేశంలో కత్తి చెంద్రాయుడు, జాషువా, కేశవ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

● మోడల్‌స్కూల్ స్టేట్ అబ్జర్వర్ నాగేంద్రకుమార్



మోడల్ స్కూల్ సిబ్బందితో మాట్లాడుతున్న స్టేట్ అబ్జర్వర్

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యార్థులకు జేఈఈ నీట్‌కు సంబంధించిన ఆన్‌లైన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని మోడల్ స్కూల్ స్టేట్ అబ్జర్వర్ పీవీ నాగేంద్రకుమార్ తెలిపారు. సోమవారం జిల్లాలోని పలు ఏపీ మోడల్ స్కూల్స్‌ను పరిశీలించారు. పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం భుజించి రుచిని, నాణ్యతను పరిశీలించారు. పాఠశాలలోని సిబ్బందితో సమావేశమై ఆహారం, పరిశుభ్రత, క్రమశిక్షణ విషయలో సూచనలు సలహాలు ఇచ్చారు. ఆహారం రుచికరంగా, నాణ్యతగా అందించాలన్నారు. పిల్లలు రోగాల బారినపడకుండా ఉండాలంటే పరిశుభ్రత పాటించడం చాలా ముఖ్యమని తెలిపారు. ప్రస్తుతం ఎఫ్ఏ-1 పరీక్షలు జరుగుతున్నందున పిల్లల స్టాండర్డ్స్‌ని పరిశీలించారు .పిల్లల స్టాండర్డ్స్ పెంచడంలో ఎక్కడా రాజీపడకుండా మంచి విద్యను అందించాలన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు జేఈఈ, నీట్ పరీక్షలకు సంబంధించి ఆన్‌లైన్ క్లాసులు ప్రసారమవుతున్నాయన్నారు. వాటిని వినియోగించుకొని పిల్లలు చక్కగా చదువుకునేందుకు కావాల్సిన ఏర్పాట్లు పాఠశాల సిబ్బంది చేయాలని ఆదేశించారు. పిల్లలు సక్రమంగా వినియోగించుకొని బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని హితబోధ చేశారు. అబ్జర్వర్ వెంట కడప జీసీడీఓ దార్ల రూత్‌ఆరోగ్య మేరీ ఉన్నారు.

తలసరి ఆదాయంపై మోదీవి అవాస్తవాలు

వేంపల్లె, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తలసరి ఆదాయంలో భారత్ దూసుకుపోతోంది, నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతోందని, మూడవ స్థానానికి చేరుతుందని ప్రధానిమోదీ చెప్పేవి అవాస్తవాలని కాంగ్రెస్ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. 191 దేశాలలో తలసరి ఆదాయంలో భారత్ 137వ స్థానంలో ఉందని, ఇటీవల విడుదలైన ఇంటర్నేషనల్ మానిటరంగ్ ఫండ్ నివేదిక చెబుతోందన్నారు. జనాభా ఎక్కువ ఉన్న కారణంగా జీడీపీ ఎక్కువ కనిపిస్తోంది. అందువల్ల జీడీపీలో ముందు ఉన్నట్లు అనిపిస్తుంది తప్ప ప్రపంచంలోని మిగతా దేశాలతో పోల్చితే వెనుకబడి ఉందని తులసిరెడ్డి తెలిపారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

మైలవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి 6, 7 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం అర్హులైనవారు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ సావిత్రి కోరారు. 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని.. ఆసక్తిగలవారు మైలవరం బాలికల గురుకుల పాఠశాలలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థి ప్రతిభ ఆధారంగా సీటు కేటాయిస్తామని, ఇతర వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

జాతీయస్థాయి కరాటే పోటీలలో పార్నపల్లె విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ సాధించిన విద్యార్థులు

లింగాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ నిషార్, ఆర్.కుషాల్ కుమార్‌లు కర్ణాటక రాష్ట్రంలో ఆదివారం జరిగిన 7వ జాతీయస్థాయి ఆలిండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ 2025లో ప్రతిభ చూపారు. ఈ పోటీలలో షేక్ మహమ్మద్ నిషార్ గోల్డ్ మెడల్ సాధించారు. జాతీయస్థాయిలో ప్రతిభ చూపిన వీరిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ఖోఖో పోటీలకు సోదరుల ఎంపిక



ఎంపికైన సోదరులు ముక్తుమ్‌సాబ్, అబ్దుల్‌కలాం

దువ్వూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు గ్రామానికి చెందిన ఎస్.ముక్తుమ్‌సాబ్, వీరి సోదరుడు అబ్దుల్‌కలాం రాయలసీమ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు కోచ్ ఖాదర్‌రెడ్డి తెలిపారు. కడపలోని స్టేడియంలో జరిగిన ఎంపిక పోటీల్లో వీరు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. తిరుపతిలో ఈనెల 16, 17, 18 తేదీల్లో రాయలసీమస్థాయి పోటీలు జరుగుతాయని వివరించారు.

స్కూటర్లు ఢీ... ఇరువురికి గాయాలు



తలకు గాయమైన ఈశ్వర్‌రెడ్డి

ఖాజీపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని కోటంగురాయునిపల్లె సమీపంలో రెండు స్కూటర్లు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు రహమత్‌ఖాన్‌పల్లెకు చెందిన ఇ.చిన్ననాగిరెడ్డి పని నిమిత్తం ఖాజీపేటకు వస్తున్నాడు. అదే సమయంలో బద్వేలు నియోజకవర్గం కొంగలవీడు గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి పులివెందుల నుంచి ఇంటికి వెళుతున్నాడు. కోటంగురాయునిపల్లె సమీపంలోకి రాగానే రెండు స్కూటర్లు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 ద్వారా కడపకు తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



ప్రశాంత్ (ఫైల్‌ఫొటో)

కొండాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకయ్యకాలువ గ్రామంలో ఈనెల 9వ తేదీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు గ్రామానికి చెందిన ప్రశాంత్ (22) అనే యువకుడు గత కొంత కాలంగా షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. చదువు మానేసి ఇంట్లోనే ఉంటున్నాడు. చిన్న వయసులోనే షుగర్‌వ్యాధి రావడంతో జీవితం మీద విరక్తి చెంది 9వ తేదీ సాయింత్రం ఇంట్లోనే గడ్డిమందు తాగాడు. గమనించిన తల్లిదండ్రులు అతనిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్‌నాయక్ తెలిపారు.

కుక్క అడ్డురావడంతో.. స్కూటర్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు



ఖాజీపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని ఖాజీపేట బ్రిడ్జి వద్ద సోమవారం కుక్కను ఢీకొనడంతో దిలీప్‌కుమార్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు ప్రొద్దుటూరు రాజుపాళెంకు చెందిన దిలీప్‌కుమార్ పని నిమిత్తం కడపకు వెళ్లి తిరిగి వెళుతుండగా ఖాజీపేట బ్రిడ్జి వద్ద కుక్కలు అడ్డం రావడంతో స్కూటర్ అదుపు తప్పి కిందపడడంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా ప్రథమ చికిత్స చేసి.. మెరుగైన వైద్యం కోసం 108 ద్వారా ప్రొద్దుటూరుకు తరలించారు.

బ్రహ్మంగారిమఠంలో...



బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. సోమి రెడ్డిపల్లెకు చెందిన బొమ్ము రామ్మోహరెడ్డి ద్విచక్రవాహనంపై మైదుకూరుకు వెళుతుండగా కుక్క అడ్డు రావడంతో అదుపు తప్పి కింద పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సాయంతో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బ్రహ్మంగారి హుండీ ఆదాయం రూ.28లక్షలు



ఆలయ ప్రాంగణంలో హుండీలను లెక్కిస్తున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకున్న భక్తులు హుండీలో స్వామివారికి సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించగా రూ.28,22,899 నగదు వచ్చినట్లు దేవస్థానం ఫిట్ పర్సన్ శంకరబాలాజీ, మేనేజరు ఈశ్వరాచారి, దేవదాయశాఖ ఆఫీసరు భారతి తెలిపారు. అలాగే బంగారు 35.500 గ్రాములు, వెండి 990 గ్రాములు ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతి కుటుంబ సభ్యులు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

ఈశ్వరీమాత ఆలయ నిర్మాణానికి రూ.లక్షా 1116 విరాళం



మఠాధిపతికి చెక్కు అందిస్తున్న దాత చక్రవర్తి దంపతులు

జగన్మాత ఈశ్వరీదేవి ఆలయ పునర్నిర్మాణం కోసం దాతలు రూ.1,01116లు విరాళం ఇచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి బీవీ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. విజయవాడ వాసి జి.శ్రీనివాస చక్రవర్తి తన కుటుంబసభ్యులతో కలిసి విరాళ చెక్కును మఠాధిపతి వీరశివకుమారస్వామికి అందజేసినట్లు ఆయన తెలిపారు.

లక్ష్యానికి అనుగుణంగా పనిచేయండి

కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు



పులివెందుల ఆర్టీసీ డిపోలో సిబ్బందికి సూచనలిస్తున్న కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు

పులివెందుల రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు అధికారులకు, సిబ్బందికి సూచించారు. సోమవారం పులివెందుల ఆర్టీసీ డిపోను ఆయన అకస్మిక తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. పలు రికార్డులను పరిశీలించారు. బస్టాండ్‌లోని ప్రయాణికులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీ మేరకు ఉచితబస్సు ప్రయాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి అమలు చేయబోతోందన్నారు. ఈనెల 15 నుంచి ఈ కార్యక్రమం మొదలు కానుందన్నారు. అందుకు అనుగుణంగా బస్సుల కండీషన్ ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలన్నారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ రామకృష్ణ, డిపో సూపరింటెండెంట్ కుళాయప్ప తదితరులు పాల్గొన్నారు.

కమలాపురం నగర పంచాయతీ కమిషనరుగా ప్రహ్లాద బాధ్యతలు



కమలాపురం రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ కమిషనరుగా బి.ప్రహ్లాద సోమవారం బాధ్యతుల స్వీకరించారు. ఈయన కదిరి మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టరు పని చేస్తూ ప్రమోషన్‌పై కమలాపురం నగర పంచాయతీకి కమిషనరుగా వచ్చారు. కమలాపురం నగర పంచాయతీ కమిషనరుగా ఉన్న పి.జగన్నాథ్ జూన్ 13న మడకశిర కమిషనరుగా బదిలీపై వెళ్లారు.బదిలీల్లో భాగంగా ప్రహల్లాదకు కమలాపురం నగర పంచాయతీకి కమిషనరుగా పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టారు.

చెన్నూరు సింగిల్‌విండో సొసైటీ అధ్యక్షుడిగా ముండ్ల శ్రీనివాసులరెడ్డి



చెన్నూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు సింగిల్‌విండో సొసైటీ అధ్యక్షుడిగా ముండ్ల శ్రీనివాసులరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలోని గుర్రం పాడుకు చెందిన శ్రీనివాసుల రెడ్డి 2014లో టీడీపీలో చేరి నాటి నుంచి నేటి వరకు ఆ గ్రామ పంచాయతీలో పార్టీ అభివృద్ధి కోసం విశేష కృషి చేశారు. అలాగేసభ్యులుగా చిన్నమాచుపల్లెకు చెందిన సీనియర్ టీడీపీ నేత మాకం వెంకటసుబ్బయ్య (భరత్), నీలంశ్రీనివాసులరెడ్డిని డైరెక్టర్లుగా ఉత్తర్వులు జారీ చేశారు.

'ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించాలి'

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జడ్పీటీసీ ఉప ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. జడ్పీటీసీ ఇలాంటి చిన్న ఉప ఎన్నికలు సైతం సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి నడిపించడం దుర్మార్గమన్నారు. సోమవారం సాయంత్రం కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నేతలు, సానుభూతిపరులపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. స్వేచ్ఛాయుతంగా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించేలా అధికారులు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీనాయకులు తదితరులుపాల్గొన్నారు.

నేతన్నల ఆపద్బాంధవుడు చంద్రబాబు

కడప మారుతీనగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చితికిపోతున్న నేతన్నల బతుకులకు ఊతమిచ్చేలా చంద్రబాబు చేనేత మగ్గానికి ఉచితంగా 200 యూనిట్లు అలాగే మరమగ్గానికి 500 యూనిట్లు ఉచితంగా ఇచ్చి వారి జీవనోపాధి మెరుగుపడేలా చేయడం హర్షణీయమని టీడీపీ తొగట వీర క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర కన్వీనరు చక్రధర్ కొనియాడారు. సోమవారం నగర క్రిష్ణాపురంలో ఉన్న చేనేత కార్మికులు చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మడక చక్రధర్, బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి సుబ్రహ్మణ్యం, పట్టుపోగుల సుబ్బారావు, గాలిరవి, బి.మురళి, చేనత కార్మికులు పాల్గొన్నారు.

పారా అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



ప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ పట్టణంలో ఉన్న పోలీస్ బేరక్స్ వేదికగా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరిగిన 6వ పారా జూనియర్, సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో జిల్లా క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచినట్లు కడప పారా అసోసియేషన్ అధ్యక్షుడు బుసిరెడ్డి దామోదర్‌రెడ్డి తెలిపారు. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 18 జిల్లాల నుంచి దివ్యాంగ క్రీడాకారులు దాదాపు 355 మంది పాల్గొన్నారు. కాగా ఆ పోటీలో కడప నుంచి పాల్గొనే వారు రన్నింగ్,షార్ట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్ , డిస్కస్‌త్రో, జావలెన్ త్రో తదితర పోటీల్లో మెడల్స్ సాధించడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ఇదిలా ఉండగా ఈ పోటీల్లో అత్యధిక ప్రతిభ చాటిన క్రీడాకారులు ఈ నెల 29, 30, 31 తేదీల్లో మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు.

బాత్‌రూమ్ అంటేనే భయపడాల్సి వస్తోంది..!

అక్కడ ఏదైనా చేసేందుకు అవినాశ్‌రెడ్డి మంచి పనివాడు : బీటెక్ రవి



పులివెందుల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి చెప్పే మాటలు, చేసే పనులకు ఇక్కడ ఎవరూ భయపడరని, ఇకపోతే ఒక బాత్‌రూమ్ విషయం గుర్తొస్తే కొంత భయమే స్తుందని, అక్కడ ఆయన ఏదైనా చేయడంలో మంచి పని వాడని పులివెందుల ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథ రెడ్డి వ్యంగ్యంగా మాట్లాడారు. సోమ వారం ఆయన అవినాశ్‌రెడ్డిపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. వారి మాటలకు గాని, వారి చేతలకు గాని భయపడేది లేదన్నారు. కానీ వారు బాత్‌రూములో ఏదైన పనిచేస్తారేమోనని కొంత భయమేస్తోందన్నారు.

ఓడిపోతామనే భయంతోనే నిందలు..: పులివెందులలో జరుగుతున్న జడ్పీటీసీ ఉప ఎన్నికలో ఓడిపోతామనే భయంతోనే ఎంపీ అవినాశ్ రెడ్డి విమర్శలు చేస్తున్నారని పులివెందుల నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినాశ్‌రెడ్డి టీడీపీ వారు ఇష్టమొచ్చినట్లు డబ్బులు పంచుతున్నారని గగ్గోలు పెడుతున్నారన్నారు. అవినాశ్‌రెడ్డి తనునమ్మే జీసస్‌పైన ప్రమాణం చేసి ఓటర్లకు డబ్బు పంచలేదని చెబితే ఇప్పటికిప్పుడే ఎన్నికల నుంచి తప్పుకొంటామని ఆయన సవాల్ విసిరారు. ఎన్నికలు జరుగుతున్నసమయంలో ఆరోపణలు చేయొచ్చు గాని ఇష్టమొచ్చిన విధంగా నిందలు వేయడం సరైంది కాదన్నారు. కేవలం ఓడిపోతామనే భయంతోనే ఇలాంటి మాటలకు తెగబడుతున్నారన్నారు. ఈ ఎన్నికలు ఏదో విధంగా అడ్డుకోవాలని అన్ని ప్రయత్నాలు చేశారన్నారు. చివరికు కోర్టుకు కూడా వెళ్లడంతో ఈ సమయంలో జోక్యం చేసుకోబోమని కోర్టు కూడా తేల్చేసిందన్నారు. ఒక గ్రామంలోని ఓటర్లు మరో గ్రామానకి వెళ్లి ఓటు వేయాల్సి వస్తోందన్నారు. దీనిని ఎవరూ అంత గుర్తించలేదన్నారు. గుర్తించి ఉండి ఉంటే ముందుగానే దీని పరిష్కారానికి కృషిచేసేవారమన్నారు.

రాహుల్ గాంధీ అరెస్ట్ అన్యాయం

కాంగ్రెస్

కడప కలెక్టరేట్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : ఈవీఎంలలో అవకతకవలపై ప్రశ్నించినందుకు లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీని అరెస్ట్ చేయడం అన్యాయమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్.డి. విజయజ్యోతి సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఈవీఎంల అవకతవకలపై ఎన్డీఏ పెద్దలు, ఎన్నికల కమిషన్‌ను ఆధారాలతో ప్రశ్నించినందుకు రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడం అప్రజాస్వామ్య మన్నారు. రాహుల్ గాంధీ అడిగిన డిజిటల్ సమాచారం ఇవ్వడానికి ఎన్నికల కమిషన్ వెనకడుగు వేస్తుండడాన్ని చూస్తే ఈవీఎంలలో గోల్‌మాల్ జరిగిందనే సందేహాలకు బలం చేకూర్చుతోందన్నారు.

నులిపురుగుల నివారణ మందు తప్పక వేయించాలి



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి

వేంపల్లె, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 12వ తేదీన పిల్లలందరికీ నులిపురుగు మాత్రలను అందించాలని తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి, డాక్టర్ నిహారిక తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నులిపురుగు నివారణ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను సోమవారం విడుదల చేశారు. కార్యక్రమానికి సంబం ధించి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహిం చారు. 1 నుంచి 19ఏళ్ల కలిగిన పిల్లలందరికీ పాఠ శాల, కళాశాలల్లో, అంగన్వాడీ కేంద్రాలలో ఉచితంగా మాత్రలు అందిస్తారని తెలిపారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాల పిల్లలకు పొడిరూపంలో ఇస్తారని తెలిపారు. మధ్యాహ్నం భోజనం అనంతరం మాత్రలు ఇవ్వాలని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ షఫి ఉన్నీసు, వెంకట రత్నం, ఫకృద్దీన్, అరుణకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

ఏఆర్‌ఓ వెంకటపతి



పులివెందుల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో శాంతియుత వాతావరణంలో ఓటర్లు వారి వారి ఓటు హక్కును వినియోగించు కోవాలని, ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ వెంకటపతి పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల జడ్పీటీసీ పరిధిలో 15 పోలింగ్ కేంద్రం ఉన్నాయన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక పీఓ, ఒక ఏపీఓ మిగిలిన సిబ్బందిని కేటాయించామన్నారు. ఎన్నికల సిబ్బందికి కేటాయించిన ఆయా రూట్లకు పోలింగ్ బాక్సులను సామగ్రి తీసుకొని పోలీసు సిబ్బందితో వారికి కేటాయించిన బస్సుల్లో అక్కడకు వెళ్లి ఏర్పాట్లు చేస్తారన్నారు. ఉదయం 7 గంటలకు ఓటింగ్ ప్రారంభమై సాయంత్రం 5గంటల వరకు కొనసాగుతుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పర్యవేక్షించేందుకు 9 మందిని కేటాయించామన్నారు. నల్లపురెడ్డిపల్లె, యర్రబల్లె, నల్లగొండువారిపల్లె గ్రామ ఓటర్లు ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి వెళ్లి ఓటును వినియోగించుకోవాల్సిందే అన్నారు. ఇందు కోసం ఓటర్లకు రవాణా కల్పించేందుకు అందుబాటులో ఉంచామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికలు జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు.

జమ్మలమడుగులో విస్తారంగా వరి సాగు



జమ్మలమడుగు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో మండలంలో వరి పంటను రైతు లు విస్తారంగా సాగు చేశారు. ధర్మాపురం, దానవులపాడు, సున్నపురాళ్లపల్లె, అంబవరం, గూడెం చెరువు, పొన్నతోట, పూర్వపు బొమ్మేపల్లె, తదితర గ్రామాల్లో వరి సాగు చేశారు. మొత్తం ఇప్పటి వరకు 1800 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు వ్యవసాయాధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. అలాగే అన్ని పంటలకు ఈ వర్షాలు బాగా ఉపయోగకరంగా ఉన్నాయని ఆయన తెలిపారు.

కంది 600 ఎకరాలు, వేరుశనగ 250 ఎకరాలు, మొక్క జొన్న 600 ఎకరాలు, పత్తి 200 ఎకరాలకుపైగా సాగు చేశారని తెలిపారు. పంటలు బాగా పండి అధిక దిగుబడితో లాభాలబాటలో చేరుకోవాలని రైతులు కోరుకుంటున్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులను ఉచిత ప్రయాణానికి అనుమతించాలని ఆంధ్రప్రదేశ్ మదర్‌థెరీస్సా దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షాకిర్‌హుస్సేన్ పేర్కొన్నారు. సోమవారం ఆర్టీసీ బస్టాండు వద్ద డిపో మేనేజర్ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అం దజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్-6 పథకం అమలులో భాగంగా మహిళలకు బస్సుల్లో ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణానికి అనుమతించడం అభినందనీయమన్నారు. దివ్యాంగులకు కూడా వారి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఉచిత ప్రయాణ వసతి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామతుల్లా, ఖాజా, ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల రిలే నిరాహార దీక్షలు



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు చేస్తున్న కార్మికులు

కడప సెవెన్ రోడ్స్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కడప మున్సిపల్ కార్పొరేషన్ ఎదుట సోమవారం అడిషనల్ కార్మికులు రిలేనిరాహార దీక్షలు ప్రారంభించారు. మున్సిపల్ యూనియన్ నగర కమిటీ ఆధ్వర్యంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కంచుపాటి శ్రీరాములు మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చినా ఇంత వరకు పెంచకపోవడం బాధాకర మన్నారు. దీంతో కార్మికులు దీక్షలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ దీక్షలు ఇక్కడితో ఆగకుండా దశల వారీగా కార్యక్రమాలు నిర్వహిస్తూ కొనసాగిస్తామని తెలిపారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే అవసరమైతే కడపనగర వ్యాప్తంగా సమ్మెకు వెళ్తామని నాయకులు హెచ్చరించారు. కాగా 7 సంవత్సరాలుగా అడిషనల్ కార్మికులకు కనీస వేతనం రూ.12వేలు ఇస్తున్నారని దానికి సంబంధించి ఈరోజు కడప కార్పొ రేషన్ ఎదుట కార్మికులు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ అనుబంధం కడప నగర విభాగం దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను సహాయ కార్యదర్శి ఇత్తడి ప్రకాష్, అధ్యక్షుడు సుంకరి రవి, జిల్లా ఉపాధ్యక్షుడు కంచుపాటి తిరుపాల్, డ్రైవర్ల కమిటీ కార్యదర్శి సుంకర కిరణ్, మస్తాన్, ఆశిబాబు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయాన్ని ఖాళీ చేయించిన పోలీసులు

పులివెందుల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యాలయాన్ని పోలీసులు ఖాళీ చేయించారు. సోమవారం రాత్రి బాకరాపురంలో ఉన్న జగన్‌క్యాంపు ఆఫీసులోని వైసీపీ కార్యాలయాన్ని పోలీసులు పూర్తిగా ఖాళీ చేయించి మూత వేశారు. జడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా అర్ధరాత్రి అవుతున్నా వైసీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల తాకిడిని పోలీసులు గుర్తించి వెంటనే వారందరినీ బయటకు పంపి మూత వేశారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలు



ప్రైవేటు హాస్పిటల్స్‌ను తనిఖీ చేస్తున్న డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

పోరుమామిళ్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యో తి): పోరుమామిళ్ల పట్టణంలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి మల్లేశ్ ఆకస్మి క తనిఖీలు చేపట్టారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆదేశాల మేరకు ఆయన సోమవారం పోరుమామిళ్లలోని ప్రైవేటు హాస్పిటల్స్ అయిన పూజ హాస్పి టల్, ఓఎల్ఎఫ్, డాక్టర్ రామమోహన్‌రెడ్డి హాస్పిటల్‌ను డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధి కారి తనిఖీ చేశారు. వాటిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెక్‌లిస్టులోని ప్రమాణాల అమలు పరిశీలించారు. అన్ని రకాల వైద్యసౌకర్యాలు, సిస్టమ్స్, వాటర్ సెక్యూరిటీలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లా అధికారుల అనుమతి మేరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని లేకుంటే తీసివేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జయరాములు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసరు సాదు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వసంతపేటలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో స్వామివారి 354వ ఆరాధన మహోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రదర్శనం, స్వామివారి బృందావనానికి పంచామృతాభిషేకం, పూజ, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి వెండికవచాలు, గజమాలలు, తులసీమాలలు, రంగు రంగుల పూలమాలలతో అలంకరించారు. శ్రీకృష్ణునికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం రాఘవేంద్రస్వామికి, శ్రీకృష్ణునికి పల్లకీసేవ, మంగళహారతులు, ప్రసాద వినియోగం చేశారు. తృతీయ ఉత్తరరాధనలో భాగంగా మంగళవారం బృందావనానికి ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు, రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఇంజనీరింగ్ విద్య ఉన్నతమైంది

సీకేదిన్నె, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్య ఎంతో ఉన్నతమైందని కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ టీఎన్.ప్రసాద్ తెలిపారు. కొత్తగా జాయిన్ అయిన ఇంజనీరింగ్ విద్యార్థులకు కళాశాలలో సోమవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో విలువలతో కూడిన ఇంజనీరింగ్ విద్యను క్రమశిక్షణతో అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కళాశాల ఎండీ చంద్ర ఓబుళరెడ్డి (నాని) మాట్లాడుతూ విద్యార్థులు కమ్యూనికేషన్ సమాజ పరివర్తనను ఉద్దేశ్యం నడిపించే నాయకత్వం పాత్ర, విద్య ప్రాముఖ్యతను వివరించారు. కేఎస్‌ఆర్‌ఎం ఓల్డ్‌స్టూడెంట్ ఎస్.వెంకటరమణయ్య ఐఏఎం లక్నో ప్రొఫెసర్ మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతతో, క్రమశిక్షణతో విజయానికి బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, వైస్‌చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, డీన్‌లు తదితరులు పాల్గొన్నారు.



ఓరియంటేషన్ ప్రోగ్రాంలో కేఎస్‌ఆర్‌ఎం ఎండీ చంద్ర ఓబుళరెడ్డి(నాని) తదితరులు

డీఎంను కలిసిన ఎన్‌ఎంయూఏ నాయకులు

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డిని ఏపీపీటీడీ ఎన్‌ఎంయూఏ కొత్త నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేనేజర్‌కు, గ్యారేజీ ఎంసీ రాజశేఖర్‌రెడ్డి, సెక్యూరిటీ అధికారి గంగయ్యకు రాష్ట్ర నాయకులు ఇచ్చిన లెటర్‌ను అందించి నూతనంగా ఎన్నికైన కమిటీని పరిచయం చేశారు. ఇందులో ఎన్‌ఎంయూఏ అధ్యక్షుడిగా చంద్రహాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పీఆర్‌జీరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అయ్యావరప్ప, వసంతరెడ్డి, చీఫ్ అడ్వైజర్లుగా వైఆర్‌కేరెడ్డి, ఎస్.నారాయణ, గ్యారేజీ ప్రెసిడెంట్‌గా ఎన్‌పీ శేఖర్, వైస్‌ప్రెసిడెంట్‌గా వెంకటయ్య, సెక్రటరీగా అశోక్, జాయింట్ సెక్రటరీగా ఏఎస్‌రామయ్య, అసిస్టెంట్ సెక్రటరీగా ఎంఆర్‌రెడ్డి, పబ్లిసిటీ సెక్రటరీగా రాంబాబులను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

నాఫెడ్ పనులు త్వరగా చేపట్టండి



మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీపీ ప్రతాప్‌రెడ్డి

మైదుకూరు రూరల్, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి) : మైదుకూరులో వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, అమ్మకాలు(నాఫెడ్) సంస్థ పనులను త్వరితగతిన చేపట్టాలని బీజేపీ నాయకుడు బీపీ ప్రతాప్‌రెడ్డి రాష్ట్ర వైద్య ఆరోగ్యవైద్య విద్యాశాఖ మంత్రి సత్యకుమార్‌ను కోరారు. ఆమేరకు సోమవారం విజయవాడ వెలగపుడి సచివాలయం లో మంత్రి సత్యకుమార్‌ను ప్రతాప్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాఫెడ్ సంస్థ ఏర్పాటుకు సర్వే నెంబర్ 1126లో 4 ఎకరాల పై చిలుకు భూమి కేటాయింపు చేసేలా, రెవెన్యూశాఖ మంత్రికి, కార్యదర్శిలకు అడ్వాన్స్ పోసిషన్ ఇవ్వాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు.

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

కొండాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి మనోహర్ బాబు, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు సుబ్బారావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 30, 31 తేదిల్లో కడపలో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని, అందుకు సంబంధించిన కరపత్రాలను వారు కొండాపురంలో విడుదల చేశారు.

వృద్ధురాలికి ఆశ్రయం

పోరుమామిళ్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కంసలవీధిలో నివాసం ఉంటున్న కొరపాటి చిన్నమ్మ అనే వృద్ధురాలికి వివేకానంద సేవాశ్రమం అండగా నిలిచింది. ఐదు రోజుల క్రితం కొడుకు వెంకటరమణ అనారోగ్యంతో చనిపోవడంతో ఒంటరి అయిన ఆమె పరిస్థితిని స్థానికులు ఆశ్రమ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామక్రిష్టారెడ్డికి సమాచారం ఇవ్వడంతో సోమవారం తమ వాహనంలో ఓబులాపురం సమీపంలో ఉన్న సేవాశ్రమానికి తీసుకువెళ్లారు. కన్నీరు మున్నీరవుతున్న ఆమెకు అతను భరోసా కల్పించారు.

బస్సుల కోసం తప్పని నిరీక్షణ

- సమయానికి రాని ఆర్టీసీ బస్సులు
- రోడ్లపై విద్యార్థుల ఎదురుచూపులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



బస్సు రాగానే ఇలా ఇబ్బందిపడుతున్న విద్యార్థినులు

చాపాడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులు సమయానికి రాకపోవడంతో విద్యార్థుల కు గంటల కొద్దీ నిరీక్షణ తప్పడంలేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు పట్టణాలకు వెళ్లి చదువుకునేందుకు ఆర్టీసీ బస్సులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్నేళ్ల నుంచి విద్యార్థులు చాలా అవస్థ పడుతున్నప్పటికి ఆర్టీసీ అధికారులు ఎవరు పట్టించుకోకపోవడంతో వాళ్ల ఇక్కట్లు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. చాపాడు మండలంలో జూనియర్ కాలేజీలు లేవు దీంతో ప్రొద్దుటూరు, మైదుకూరు పట్టణాలకు వెదురూరు, రాజుపాళెం, అనంతపురం, టీవోపల్లె, చిన్నగురవలూరు, నక్కలదిన్నె, తదితర గ్రామాల నుంచి ప్రతిరోజు సుమారు 200 మంది కాలేజీలకు వెళుతున్నారు. ఈ గ్రామాల నుంచి చాపాడులోని జిల్లా పరిషత్ (తెలుగు, ఉర్దూ) ఉన్నత పాఠశాలలకు కూడా వెళుతున్నారు. చాపాడు నుంచి ప్రొద్దుటూరుకు ఉదయం 7 గంటల నుంచి 8.30 గంటలలోపు బస్సులు తక్కువగా నడుపుతున్నారు. ప్రొద్దుటూరు, మైదుకూరు డిపోల నుంచి బస్సులు తిరుగుతున్నా తక్కువ సంఖ్యలో ఉండడంతో విద్యార్థులకు అసౌకర్యంగా ఉంది. మరో నాలుగు బస్సులు నడపాలని విద్యార్థులు కోరుతున్నా పట్టించుకునేవారులేరు. ప్రతిరోజు విద్యార్థులు కాలేజీలకు ఉదయం 9 గంటలలోపే చేరుకోవాల్సి ఉంది. ఈ సమయంలో ఉన్న తక్కువ బస్సులు ప్రయాణికులతో రద్దీతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. టీవోపల్లె, బసిరెడ్డిపల్లె, చియ్యపాడు, రేపల్లె, గుంతచీపాడు గ్రామాల నుంచి 62 మంది విద్యార్థులు చాపాడులోని హైస్కూలుకు వెళుతున్నారు. వారికి బస్సు సౌకర్యం లేదు. అందువలన ప్రతిరోజు ఆటోలో వెళ్లాల్సివస్తోంది. ఇక నక్కలదిన్నె, రాజుపాళెం, వెదురూరు, అనంతపురం, మరికొన్ని గ్రామాల నుంచి 55 మంది విద్యార్థులు చాపాడులోని హైస్కూళ్లకు వెళ్లి తిరిగి ఇళ్లకు వెళ్లేటప్పుడు సాయంత్రం 4 గంటలకు స్కూలు వదిలితే రోడ్లపై ఆరు గంటల వరకు సుమారు రెండు గంటల పాటు బస్సుకోసం ఎదురుచూస్తున్నారు. ప్రొద్దుటూరు నుంచి వి.రాజుపాళెం వెళ్లే బస్సు 4.30 గంటలకు చాపాడుకు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. విద్యార్థులకు బస్సుసౌకర్యం ఏర్పాటు చేయాలని మండల సర్వసభ్య సమావేశాల్లో పలుమార్లు కోరుతూ తీర్మాణాలు చేసినా ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడంలేదు. సరైన బస్సు సౌకర్యం లేక కాలేజీ విద్యార్థులు, హైస్కూలు విద్యార్థులు విధిలేని పరిస్థితుల్లో ఆటోల్లో వెళుతున్నారు. ఒక్కో ఆటోల్లో 25 మందికిపైగా విద్యార్థులు వెళుతుండడంతో ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి విద్యార్థులకు బస్సుసౌకర్యం ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

15 తర్వాత బస్సుల ఏర్పాటుకు చర్యలు

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈనెల 15వతేదీ తర్వాత ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ ప్రొద్దుటూరు డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. బస్సుల్లేక విద్యార్థుల ఇక్కట్లపై 'ఆంధ్రజ్యోతి' డీఎంను వివరణ కోరగా పైవిధంగా ఆయన స్పందించారు. ఎక్కువ మంది ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణించడంలేదని ఆటోల్లో వెళుతున్నారన్నారు.

ఘనంగా రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



పుష్పాలంకరణలో రాఘవేంద్రస్వామి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వసంతపేటలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో స్వామివారి 354వ ఆరాధన మహోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రదర్శనం, స్వామివారి బృందావనానికి పంచామృతాభిషేకం, పూజ, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి వెండికవచాలు, గజమాలలు, తులసీమాలలు, రంగు రంగుల పూలమాలలతో అలంకరించారు. శ్రీకృష్ణునికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం రాఘవేంద్రస్వామికి, శ్రీకృష్ణునికి పల్లకీసేవ, మంగళహారతులు, ప్రసాద వినియోగం చేశారు. తృతీయ ఉత్తరరాధనలో భాగంగా మంగళవారం బృందావనానికి ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు, రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

పి.టంగుటూరు పీఏసీఎస్ చైర్మన్‌గా ఖాదర్‌బాషా



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి బొకే అందిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ ఖాదర్‌బాషా

రాజుపాలెం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాజపాలెం మండలం పి.టంగుటూరు పీఏసీఎస్ చైర్మన్‌గా మానికింది ఖాదర్‌బాషాను నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా సోమవారం ఆయన ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. రాజుపాలెం మండలానికి బీసీకి పీఏసీఎస్ చైర్మన్ కేటాయించడంతో పాటు తమకు చైర్మన్‌గా వచ్చేందుకు కృషి చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపా రు. ఈ కార్యక్రమంలో నీటిసంఘం అధ్యక్షుడు కాకర్ల సంజీవరెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్, టీడీపీ నాయకులు వెంకటరెడ్డి, కందుకూరి వెంకటసుబ్బన్న, మాణికింది మాబాషా, పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయమ్మను సత్కరించిన సహకార సంఘ చైర్మన్



పోరుమామిళ్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల సహకారసంఘం చైర్మన్‌గా ఎన్నికైన ఎరసాలకు చెందిన కల్లూరు వెంకటక్రిష్ణారెడ్డి సోమవారం బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఇందుకు సహకరించిన మాజీ ఎమ్మెల్యేతోపాటు యువనేత రితీష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేత బొజ్జ రోశన్న, మండల అధ్యక్షుడు భైరవ ప్రసాద్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చెన్నరాయుడు, ఇమాంహుసేన్, రామక్రిష్ణారెడ్డి, వెంకటసుబ్బయ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకు సహకరించాలి

కలసపాడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నులిపురుగులను నివారించేందుకు అందరూ సహకరించాలని ఎంఈఓ ప్రేమ్‌సాగర్, వైద్యాధికారి శైల, డాక్టర్ సాయితేజలు కోరారు. నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, అంగన్వాడీ కేంద్రాలలోని ఆల్‌బెండోల్ మాత్రలను ఉచితంగా అందజేస్తామన్నారు. సీహెచ్‌ఓ వెంకటసుబ్బమ్మ, హెల్త్ అసిస్టెంట్ రామతీర్థం, ఏఎన్‌ఎమ్‌లు లక్ష్మీదేవి,జశింత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు స్కాట్ సామగ్రి వితరణ



విద్యార్థులకు స్కాట్ సామగ్రి అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలులో ఎన్‌సీసీ విద్యార్థులకు ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్కాట్ సామగ్రిని వితరణ చేశారు. సోమవారం టెక్సాస్‌కు చెందిన లావనూరు రాధిక తన తల్లి భూమిరెడ్డి శైలజ చేతుల మీదుగా స్కాట్ సామగ్రి అందజేశారు. ఆదరణ సేవా సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ మాట్లాడుతూ పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయుడు గురప్ప విన్నపం మేరకు దాతల సహకారంతో స్కాట్ సామగ్రి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గీత, రిటైర్డు టీచర్ నాగరాజు, సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాద్, మాధవ తదితరులు పాల్గొన్నారు.

డీఎంను కలిసిన ఎన్‌ఎంయూఏ నాయకులు

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డిని ఏపీపీటీడీ ఎన్‌ఎంయూఏ కొత్త నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మేనేజర్‌కు, గ్యారేజీ ఎంసీ రాజశేఖర్‌రెడ్డి, సెక్యూరిటీ అధికారి గంగయ్యకు రాష్ట్ర నాయకులు ఇచ్చిన లెటర్‌ను అందించి నూతనంగా ఎన్నికైన కమిటీని పరిచయం చేశారు. ఇందులో ఎన్‌ఎంయూఏ అధ్యక్షుడిగా చంద్రహాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పీఆర్‌జీరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అయ్యావరప్ప, వసంతరెడ్డి, చీఫ్ అడ్వైజర్లుగా వైఆర్‌కేరెడ్డి, ఎస్.నారాయణ, గ్యారేజీ ప్రెసిడెంట్‌గా ఎన్‌పీ శేఖర్, వైస్‌ప్రెసిడెంట్‌గా వెంకటయ్య, సెక్రటరీగా అశోక్, జాయింట్ సెక్రటరీగా ఏఎస్‌రామయ్య, అసిస్టెంట్ సెక్రటరీగా ఎంఆర్‌రెడ్డి, పబ్లిసిటీ సెక్రటరీగా రాంబాబులను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీని అరెస్టు చేయడం అప్రజాస్వామికం

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సీఐసీసీ నేత రాహుల్‌గాంధీని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాష అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో గత సార్వత్రిక ఎన్నికలపై ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ లేవనెత్తిన అనేక సందేహాలకు, ఆరోపణలకు ఎలక్షన్ కమిషన్ సమాధానం ఇవ్వకపోగా రాహుల్‌గాంధీని అరెస్టు చేయడం దారుణమని విమర్శించారు. రాహుల్ గాంధీ ప్రారంభించిన ఓటు చోర్ క్యాంపెయిన్‌ను ఆంధ్రప్రదేశ్‌లో సైతం కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రతి గడపకు చేర్చుతామని అన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాలి



డీఎం మధుసూదన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దివ్యాంగులు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులను ఉచిత ప్రయాణానికి అనుమతించాలని ఆంధ్రప్రదేశ్ మదర్‌థెరీస్సా దివ్యాంగుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షాకిర్‌హుస్సేన్ పేర్కొన్నారు. సోమవారం ఆర్టీసీ బస్టాండు వద్ద డిపో మేనేజర్ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్-6 పథకం అమలులో భాగంగా మహిళలకు బస్సుల్లో ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణానికి అనుమతించడం అభినందనీయమన్నారు. దివ్యాంగులకు కూడా వారి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఉచిత ప్రయాణ వసతి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామతుల్లా, ఖాజా, ఆసీఫ్ పాల్గొన్నారు.

40 మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు



గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

దువ్వూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం 40 మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 18 మంది హైరిస్క్ గర్భిణులకు స్కానింగ్ నిర్వహించారు. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సలహాలు ఇచ్చారు. వైద్యులు సురేష్‌బాబు, రోహిణి, హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మలమడుగులో విస్తారంగా వరి సాగు



జమ్మలమడుగు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో మండలంలో వరి పంటను రైతు లు విస్తారంగా సాగు చేశారు. ధర్మాపురం, దానవులపాడు, సున్నపురాళ్లపల్లె, అంబవరం, గూడెం చెరువు, పొన్నతోట, పూర్వపు బొమ్మేపల్లె, తదితర గ్రామాల్లో వరి సాగు చేశారు. మొత్తం ఇప్పటి వరకు 1800 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు వ్యవసాయాధికారి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. అలాగే అన్ని పంటలకు ఈ వర్షాలు బాగా ఉపయోగకరంగా ఉన్నాయని ఆయన తెలిపారు. కంది 600 ఎకరాలు, వేరుశనగ 250 ఎకరాలు, మొక్కజొన్న 600 ఎకరాలు, పత్తి 200 ఎకరాలకుపైగా సాగు చేశారని తెలిపారు. పంటలు బాగా పండి అధిక దిగుబడితో లాభాలబాటలో చేరుకోవాలని రైతులు కోరుకుంటున్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలు



ప్రైవేటు హాస్పిటల్స్‌ను తనిఖీ చేసిన డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

పోరుమామిళ్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల పట్టణంలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి మల్లేష్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆదేశాల మేరకు ఆయన సోమవారం పోరుమామిళ్లలోని ప్రైవేటు హాస్పిటల్స్ అయిన పూజ హాస్పిటల్, ఓఎల్ఎఫ్, డాక్టర్ రామమోహన్‌రెడ్డి హాస్పిటల్‌ను డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధి కారి తనిఖీ చేశారు. వాటిలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం చెక్‌లిస్టులోని ప్రమాణాల అమలు పరిశీలించారు. అన్ని రకాల వైద్యసౌకర్యాలు, సిస్టమ్స్, వాటర్ సెక్యూరిటీలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లా అధికారుల అనుమతి మేరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని లేకుంటే తీసివేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జయరాములు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసరు సాదు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌తో ప్లాట్లను క్రమబద్ధీకరించుకోండి

బద్వేలుటౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : అనాథరైజ్డ్ లేఔట్లలో ప్లాట్లు కొని అప్రూవల్ రాక ఇబ్బందులు పడుతున్న వారు ఎల్‌ఆర్‌ఎస్‌తో వాటిని క్రమబద్ధీకరించుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 134ను విడుదల చేసిందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దరఖాస్తు దారులు దస్తావేజుల లేఔట్లలో కాపీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశాక రూ.10వేల రూపాయలకు తగ్గకుండా ప్రాథమికంగా ఫీజు చెల్లించాలన్నారు. ఫీజు మొత్తాన్ని 45 రోజులలోపల చెల్లిస్తే 10శాతం రాయితీ ఉంటుందని, 45 నుంచి 90 రోజుల్లోపల చెల్లించినట్లు అయితే 5శాతం రాయితీ ఉంటుందన్నారు. క్రమబద్ధీకరణ ఫీజు కాకుండా చెల్లించాల్సిన 14శాతం ఓపెన్ స్పేస్ చార్జీల్లోనూ 7శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. బద్వేలు మున్సిపాలిటీలో సుమారు 17 అనాథరైజ్డ్ లేఔట్లు ఉన్నాయన్నారు. అలాంటి వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎమ్మెల్యే చొరవతో గ్రామ సమస్యలకు చెక్



గుంతలు పూడుస్తున్న దృశ్యం

మైదుకూరు రూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చొరవతో గ్రామ సమస్యలకు చెక్‌పడింది. ఇందులో చెరువు కట్ట మీద కంప చెట్లతొలగింపుతోపాటు గ్రామంలో ఏర్పడ్డ గుంతలను వెంటనే పూడ్పించి సమస్యలను పరిష్కరించారు. మైదుకూ రు మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లె గ్రామ సమీపంలో ఉన్న స్టోన్ కసర్ నుంచి రోడ్డు పనుల నిమిత్తం కంక ర, చిప్స్ లాంటివి భారీ వాహనాలు చెరువు కట్ట మీద నుంచి రవాణా జరుగుతుం డడంతో గ్రామంలోని రోడ్లన్నీ గుంతలమయంగా మారిపోయాయి. ఈ విషయాలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే చెరువు కట్టపై కంప చెట్లను తొలగించి రోడ్లపై గుంతలను పూడ్చాలని ఆదేశాలివ్వడంతో సదరు కంపెనీ వారు సోమవారం పనులు చేపట్టారు.

మహబూబ్‌బాషాపై చర్యలు తీసుకోండి

- విలేకరినంటూ వేధిస్తున్నాడని కత్తెర గండ్ల సర్పంచ్ ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ సుభద్రమ్మ

కాశినాయన ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): చెన్నవరం గ్రామానికి చెందిన పుల్లూ రు మహబూబ్‌బాషా అనే వ్యక్తి విలేకరినంటూ (ఆంధ్రజ్యోతికాదు)తన వ్యక్తిత్వానికి భంగం కలిగేవిధంగా వ్యవహరిస్తూ తనను తన కుటుంబ సభ్యులను మానసిక క్షోభకు గురిచేస్తున్నాడని కత్తెరగండ్ల సర్పంచ్ చెన్నుపల్లె సుభద్రమ్మ వాపోయారు. అతనిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలంటూ సర్పంచ్ సోమవారం నర్సాపురం పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ మహబూబ్‌బాషా తాను విలేకరినని కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎన్డీ విజయజ్యోతి పీఏనని చెప్పుకుంటూ తమను బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. గత 6సంవత్సరాల క్రితం గ్రామసచివాలయంలో మరుగుదొడ్డి నిర్మిం చానని తనకు లక్ష రూపాయల బిల్లు ఇవ్వాలన్నాడని పాత పనులకు తాను బిల్లులు ఇవ్వలేనని ఏమైనా ఆధారాలు ఉంటే అధికారులను కలిసి మాట్లాడుకుంటే సహకరిస్తా నని చెప్పినసప్పటికి వినకుండా తనను తీవ్ర మానసిక మనోవేదనకు గురిచేస్తున్నడని ఆమె వాపోయారు.. మహిళా సర్పంచ్‌నని చూడకుండా తాను రూ.50 లక్షలు అవినీతి చేసినట్లు అసత్యపు ఆరోపణలతో సోషల్ మీడియా గ్రూపుల్లో పెట్టి పత్రికల్లో వార్తలు రాయించి తన ప్రతిష్టను భంగపరిచేవిధంగా వ్యవహరిస్తున్నాడని పోలీసులు విచారించి ఇతనిపై కేసు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు. కాగా మహబూబ్‌బాషా సైతం నర్సాపురం పోలీస్ స్టేషన్‌లో సర్పంచ్ కుటుంబ సభ్యులపై సోమవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ



మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను పంపిణీ చేసిన దృశ్యం

పోరుమామిళ్ల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మదర్‌థెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 20 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. గత ఆరు నెలలుగా మొదటి బ్యాచ్‌గా వారికి ఉచిత టైలరింగ్ శిక్షణ ఇచ్చి అనంతరం ఉచితంగా కుట్టుమిషన్లను ఆ సంస్థ వ్యవస్థాపకుడు చిత్తరవిప్రకాశ్‌రెడ్డి అందించారు. సోమవారం ఆయన టైలరింగ్ సెంటరులో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ టైలరింగ్ సెంటరును ఆరు నెలల పాటు సమర్థవంతంగా నిర్వహించిన అడ్మినిస్ట్రేషన్ రోశిలిని ఇన్‌స్పెక్టరు పారిజాన్కు ధన్యవాదాలు తెలిపారు. 1 నుంచి 2వ బ్యాచ్ ప్రారంభిస్తున్నట్లు వారు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఓఎల్ఎఫ్ ప్రధానోపాధ్యాయురాలు చిత్త ఆరోగ్యరాణి, డాక్టర్ మౌనికా రెడ్డి, ప్రజ్వలరెడ్డి పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల ఆక్రమణపై తహసీల్దారుకు ఫిర్యాదు

ప్రొద్దుటూరు , ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ బోర్డు భూముల ఆక్రమణలపై సర్వే చేసి ఆక్రమిత కట్టడాలపై చర్యలు తీసుకోవాలని వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ అక్తర్ వాసీమ్ కోరారు. సోమవారం తహసీల్దారు గంగయ్యను కార్యాలయంలో కలిసి తాళ్లమాపురం మోడమీదిపల్లెలోని వక్ఫ్‌భూముల ఆక్రమణలపై రీసర్వే చేయమని డీఆర్‌వో ఇచ్చిన ఆదేశాల కాపీని తహసీల్దారుకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తాళ్లమాపురంలో 319 సర్వేనెంబరులో 8.27 ఎకరాల భూములలో అక్రమంగా సాగు చేసుకుంటున్నారని, అలాగే మోడమీది పల్లె పొలంలో దాదాపు 37.29 ఎకరాల భూములు ఆక్రమణలకు గురయ్యాయని వాటిని సర్వేచేసి ఆక్రమణలు గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రొద్దుటూరు పరిధిలో గల వక్ఫ్‌భూములు అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరుగకుండా సబ్‌రిజిస్ట్రార్‌కు భూముల జాబితాను అందజేసినట్లు తెలిపారు. ఆయన వెంట వక్ఫ్ భూముల పరిరక్షణ సంఘం నేత షరీఫ్ ఉన్నారు.

ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆటో యూనియన్ నాయకులు

బద్వేలు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆమేరకు సోమవారం ఆటో స్టాండ్ దగ్గర ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నేత నాగేష్ మాట్లాడుతూ ఆటో కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్‌తో కూడిన సంక్షేబోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. జీవో 21, 31లను రద్దు చేయాలని, అలాగే డ్రైవర్లకు వాహనమిత్ర వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆటోడ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నాగేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్‌రాయల్ తదితరులు పాల్గొన్నారు.